08-11-2024
# మహా పత్రిక
ANN తెలుగు
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 297 పేజీలు-10 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM

## జైలుకెళ్తా.. పాదయాత్ర చేస్తా

- రూ. 55 కోట్లు కట్టమని నేనే చెప్పా
- బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని రాజ్ భవన్‌లో కుట్రలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు
- అరెస్టైతే హ్యాపీ.. జైల్లో ట్రిమ్ అవుతా
- దేనికైనా రెడీ.. ఏం చేసుకుంటారో చేస్కోండి
- రేవంత్ రెడ్డి ఉడతూపులకు భయపడ



**హైదరాబాద్, మహా:** ఈరేస్‌ను ప్రభుత్వం తరపున హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు రూ.55 కోట్లు ఖర్చు చేశాం. అందులో అర్విండ్ కుమార్ తప్పు ఏం లేదు. నేను ఈ మొత్తానికి బాధ్యత తీసుకుంటానని మాజీమంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ కేసు పెట్టిన తాను జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ అన్నారు. 2 నెలలు జైల్లో ఉండి యోగా చేసి ట్రిమ్ అవుతానన్నారు. ఫార్ములా వన్ తో తాము హైదరాబాద్ ఇజేమ్ పెంచితే.. రేవంత్ ఇజ్జత్ తీస్తున్నాడని మండిపడ్డారు.

మిగతా 2లో

## ఈ మహాలక్ష్ములను చూస్తుంటే సంతోషంగా ఉంది

### తమ ప్రభుత్వ పథకం ఉద్దేశం అర్థమవుతోంది

సీఎం రేవంత్ ఇంట్రెస్టింగ్ ట్వీట్.. మహిళల ఉచిత ప్రయాణం

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఆడబిడ్డల ఆకాంక్షలను నెరవేర్చాలనే మంచి ఉద్దేశంతోనే 'మహాలక్ష్మీ' పథకాన్ని ప్రకటించామని సీఎం రేవంత్ వెల్లడించారు. ప్రస్తుతం ఆడపిల్లలు, మహిళలు ఫ్రీ బస్సు సౌకర్యాన్ని చక్కగా వినియోగించుకుంటున్నారని అన్నారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న ఆడిపిల్లలపై ఓ నెటిజన్ ట్వీట్ చేశారు.

వివరాలు 2లో



# ఎదురులేని సీఎం రేవంత్

## మాట తప్పని.. మడమతిప్పని ప్రజానేత

### 24/7 పనిచేసే ముఖ్యమంత్రిగా జనం కితాబు..

### రేవంతన్నగా గుండెల్లో పెట్టుకుంటున్న జనం

మహోజ్వల భవిత వైపు అడుగులు.. ఉద్యోగాల కల్పనలో కొత్త హిస్టరీ

ప్రజల ముంగిటకు ప్రజాపాలన.. రుణమాఫీ, ఫ్రీ బస్.. ఫ్రీ కరెంట్, గ్యాస్ సబ్సిడీలతో సక్సెస్

హైడ్రాతో అక్రమార్కుల గుండెలు హడల్

ఫ్యూచర్ సిటీ, స్కిల్ యూనివర్శిటీ, మూసీ పునరుజ్జీవ ప్రణాళికలతో స్పెషల్ ఇమేజ్

300 రోజుల్లో ఎన్నో విజయాలు.. ప్రతీకార రాజకీయాలకు దూరం.. పాలనను గాడిలో పెట్టడమే లక్ష్యం

**ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి తొలి బర్త్ డే సందర్భంగా ప్రజాపాలనపై ప్రత్యేక కథనం**



(కంది రామచంద్రారెడ్డి)

**హైదరాబాద్, మహా:** మాట తప్పని, మడమ తిప్పని ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పాలనలో దూసుకుపోతున్నారు. 300 రోజుల పాలనను దిగ్విజయంగా పూర్తిచేసుకొని మహోజ్వల భవిత వైపు అడుగులు వేస్తున్నారు. 24/7 పనిచేస్తున్న ముఖ్యమంత్రిని రేవంతన్నగా ప్రజలు గుండెల్లో పెట్టుకుంటున్నారు. తెలంగాణ ప్రజల అసలైన ఆశా కిరణంగా పేరు తెచ్చుకుంటున్న రేవంత్ పాలనకు పబ్లిక్ ఫిదా అవుతున్నారు. 300 రోజుల పాలనలో అద్భుతమైన పాలనను అందించి అందరితోనూ శభాష్ అనిపించుకుంటున్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రభుత్వాలు మారుతుంటాయి. ముఖ్యమంత్రులు మారుతుంటారు. కానీ కొన్ని ప్రభుత్వాలు మాత్రమే ప్రజా ప్రభుత్వాలుగా చరిత్రలో నిలిచిపోతాయి. కొందరు ముఖ్యమంత్రులు మాత్రమే చరిత్రలో తమకంటూ ప్రత్యేకపేజీని లిఖించుకుంటారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన డేరింగ్ అండ్ డాషింగ్ విధానాలతో ప్రజల మన్ననలు పొందుతున్నారు. ముఖ్యంగా ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... నాటి వైఎస్ పాలనను గుర్తుచేస్తూ అన్నివర్గాల ప్రశంసలు పొందుతున్నారు. రాష్ట్రంలో మార్పును తీసుకొచ్చి.. నియంతృత్వానికి పాతరేసి ప్రజాస్వామ్య పాలనను కాంగ్రెస్ సర్కారు అందిస్తోంది. వైఎస్ సంక్షేమాన్ని, చంద్రబాబు పాలనా దక్షతను కలగలిపి తనదైన ప్రత్యేకమార్క్ తో ఎదురులేని నేతగా చరిత్రలో నిలిచిపోతున్నాడు సీఎం రేవంత్ రెడ్డి.

మిగతా 2లో

### కంచెలు తొలగించి

ప్రగతిభవన్ ముందున్న ఇనుపకంచెలను తొలగించడంతో తెలంగాణలో అసలైన ప్రజాపాలన మొదలైంది. ఏ ప్రగతి భవన్ లో సామాన్యులకు ఎంట్రీ దక్కలేదో అదే ఇప్పుడు మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్ గా మారింది. ప్రజావాణి పేరుతో ప్రజలందరూ తమ కష్టాలను చెప్పుకునే సరైన వేదికను ప్రభుత్వం కల్పించింది. ప్రతి వారంలో రెండు రోజులు ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు చెప్పుకునే అవకాశాన్ని ఈ ప్రభుత్వం కల్పించింది. ప్రజాపాలనలో ఇదొక చారిత్రాత్మమైన ముందడుగుగా చెప్పవచ్చు.



# జైలుకెళ్తా.. పాదయాత్ర చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

గురువారం తెలంగాణ భవన్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై బీఆర్ఎస్ ను ఖతం చేయాలని రాజ్ భవన్ లో ప్రయత్నం చేశారన్నారు. అయినా సరే తాను దేనికైనా రెడీగా ఉన్నానని, ప్రజల తరపున పోరాటం కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను దెబ్బ తీస్తున్నాడని కేటీఆర్ ఆరోపించారు. ఈ రేసింగ్ ప్రయోజనాల గురించి ఈ సన్నాసి ఎవరు చెప్పినా సరే వినటం లేదని, రోజుకో రకంగా ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. ఏం చేసుకుంటావో చేసుకో.. మొత్తం ఏం జరిగిందో నేనే ప్రజలకు చెబుతున్నా అంటూ సంచలన కామెంట్స్ చేశారు.

**గొప్ప నగరాల్లోనే రేసింగ్**

'ఎఫ్ 1 రేసు కోసం నేను ఎంతో ప్రయత్నం చేశాను. కానీ ఇండియాకు వచ్చే ఇంట్రెస్ట్ లేదని వాళ్లు చెప్పారు. భవిష్యత్ తరాలకు సంబంధించి ఎలక్ట్రిక్ వెహికిల్స్ ను ప్రోత్సహించే పరిస్థితి ఇప్పుడు వచ్చింది. ఫార్ములా రేసింగ్ లో కూడా ఎలక్ట్రిక్ వెహికిల్స్ తో చేసే రేసింగ్ ను ఫార్ములా ఈరేస్ అంటారు. ఎఫ్ 1 రేసు రాని కారణంగా మేము ఫార్ములా ఈరేస్ తెచ్చే ప్రయత్నం చేశాం. ఈరేస్ అనేది ప్రపంచంలోని అత్యంత గొప్ప నగరాల్లో జరుగుతోంది. ఈ నగరాల చోట హైదరాబాద్ ను చేర్చాలని మేము ఈరేస్ ను ఇక్కడికి తెచ్చే ప్రయత్నం చేశాం. మేము ఈరేస్ తెచ్చేందుకు చేసే ప్రయత్నంలో సియోల్, జోహెన్నస్ బర్గ్ ను తలదన్ని మన హైదరాబాద్ కు ఈరేస్ ను తెచ్చాం. ఫార్ములా రేసింగ్ ను మేము ఒక రేసింగ్ గా మాత్రమే



చూడలేదు. ఎలక్ట్రిక్ కార్లను ప్రమోట్ చేయాలనుకున్నాం. ఎలక్ట్రిక్ వెహికిల్స్ కు మన హైదరాబాద్ ను అడ్డాగా మార్చాలని మేము ఈరేస్ ను ఒక అడుగుగా ప్రయత్నం చేశాం' అని చెప్పారు.

**కేవలం రూ. 50 కోట్లు మాత్రమే ఖర్చుచేశాం**

ఫార్ములా ఈరేస్ కోసం నాలుగేళ్లు, త్రైపాక్షిక ఒప్పందం చేసుకున్నాం. నిర్వహణ సంస్థ, హెచ్ఎండీఏ, గ్రీన్ కో అనే మూడు సంస్థలతో ఒప్పందం చేసుకున్నాం. ప్రభుత్వానికి లాభం వచ్చినప్పటికీ గ్రీన్ కో అనే సంస్థ మాత్రం తమకు లాభం రాలేదని పక్కకు తప్పుకుంది. గ్రీన్ కో సంస్థ వెళ్లిపోవటంతో ఈరేస్ పోకుండా ఉండేందుకు ఆ డబ్బులను మేము ఇద్దామని అర్విందు కు చెప్పానని కేటీఆర్ అన్నారు. వాళ్లకు స్పాన్సర్లు దొరకకపోవటంతో ప్రమోటర్ దొరికే వరకు నేనే భరోసా ఉంటానని చెప్పాను. ప్రభుత్వం తరపున ఆ డబ్బు ఇద్దామని చెప్పాను. హెచ్ఎండీఏకు తెలియకుండా మేము డబ్బులు ఇచ్చామని అంటున్నారు. కానీ హెచ్ఎండీఏ కు పూర్తిగా తెలుసు. ఈరేస్ ను మేము ప్రభుత్వం తరపున కార్యక్రమంగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ను పెంచేందుకు రూ.55 కోట్లు ఖర్చు చేశాం. అందులో అర్విందు కుమార్ తప్పు ఏం లేదు. నేను ఈ మొత్తానికి బాధ్యత తీసుకుంటాను. పురపాలక శాఖలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పురపాలక శాఖలో ఇంటర్నల్ గా డబ్బు అడ్జస్ట్ మెంట్ చేసుకోవచ్చు. హెచ్ఎండీఏ ఇండిపెండెంట్ బోర్డు. దానికి ఛైర్మన్ సీఎం, వైస్ ఛైర్మన్ పురపాలక శాఖ మంత్రి. మన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తినకుండా రూ. 55 కోట్లు కట్టమని నేనే అర్విందు కుమార్ కు చెప్పాను. దీనికి కేబినెట్ అప్రూవల్ అవసరం లేదు. హెచ్ఎండీఏ స్వతంత్ర బోర్డు. ఈరేస్ కారణంగా 49 దేశాల్లో హైదరాబాద్ పేరు తెలిసేలా చేశాం. ఎన్నో పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేశాం. కూలగొట్టుడు, విధ్వంసం చేయటమే వాళ్లకు తెలిసిన పని. కానీ నిర్మాణం చేయటం వారికి తెలియదన్నారు. అందుకే సీఎంగా ఎన్నికైన వెంటనే ఆ ప్రాజెక్ట్, ఈ ప్రాజెక్ట్ రద్దు అంటూ ప్రకటనలు చేశారని మండిపడ్డారు. నా మీద కోపంతో అందులో నాకేదో వచ్చిందనుకొని ఏమీ తెలుసుకోకుండా దాన్ని రద్దు చేశారు. హైదరాబాద్ ఈరేస్ ను రద్దు చేయటంతో జాగ్వార్, నిస్సాన్ లాంటి సంస్థల వాళ్లు సిగ్గుచేటు అన్నారు. రేవంత్ రెడ్డి దిక్కుమాలిన నిర్ణయంతో ప్రపంచం ముందు హైదరాబాద్ ఇజ్జత్ పోయింది. మనకు రూ.700 కోట్లు లాస్ వచ్చింది. కొందరు రాస్తున్నారు కేటీఆర్ చుట్టు ఉచ్చు అని.. దీనిలో ఉచ్చు, బొచ్చు అనేది ఏముంది నిజానికి హైదరాబాద్ లో ఈరేస్ రాకుండా మన నగరం ఇమేజ్ దెబ్బ తీసినందుకు ఆయనపైనే కేసు పెట్టాలి. ఏసీబీ ఫుల్ ఫామ్ రేవంత్ రెడ్డికి తెలుసా? అవినీతి జరిగితే ఏసీబీ ని వాడాలి. కానీ ఇక్కడ అవినీతి ఏముంది? నాకు వచ్చింది ఏముంది? హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినవద్దని నేను ప్రభుత్వ పరంగా ఈ కార్యక్రమాన్ని తీసుకొని రూ. 50 కోట్లు ఖర్చు చేశాను. రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో ఒలింపిక్స్ నిర్వహిస్తామంటాడు. ఒలింపిక్స్ నిర్వహణకు ఎంత ఖర్చు అవుతదా తెలుసా? నిజానికి కేసు పెట్టాలంటే మేఘా కంపెనీ మీద పెట్టాలె. కృష్ణా రెడ్డి మీద ఏసీబీ మీద కేసు పెట్టే దమ్ముందా రేవంత్ రెడ్డికి అంటూ సవాల్ చేశారు.

## ఈ మహాలక్ష్ములను చూస్తుంటే సంతోషంగా ఉంది

(మొదటిపేజీ తరువాయి)

'నమస్కారం రేవంత్ రెడ్డి సార్.. ఈ పిల్లలు మహాలక్ష్మి పథకాన్ని ఉపయోగించుకుని గ్రౌండ్కు వెళ్లి చక్కగా గేమ్స్ నేర్చుకుంటున్నారు. మహాలక్ష్మి పథకం ఆడపిల్లలు చాలా ధైర్యంగా ముందుకు వెళ్లటానికి ఉపయోగపడుతుంది సార్. మీకు ధన్యవాదాలు సార్.' అని ట్వీట్ చేసారు.ఈ ట్వీట్కు సీఎం రేవంత్ రిప్లయ్ ఇచ్చారు. ఈ మహాలక్ష్ములను చూస్తుంటే తమ ప్రభుత్వ ఉద్దేశం నెరవేరుతోందని అర్థమవుతోందన్నారు. చాలా సంతోషంగా ఉందని.. వీరు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు రేవంత్ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేశారు. 'ఆడబిడ్డల ఆకాంక్షలను నెరవేర్చాలన్న సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ "మహాలక్ష్మీ" పథకాన్ని ప్రకటించింది. ఈ మహాలక్ష్ములను చూస్తుంటే.. ఆ పథకం ఉద్దేశం నెరవేరుతోందన్న విషయం అర్థమవుతోంది. చాలా సంతోషం. ఆ పిల్లలు భవిష్యత్లో ఉన్నత స్థాయికి ఎదగాలని, వారి లక్ష్యాలను చేరాలని ఆకాంక్షిస్తున్నాను.' అని రేవంత్ ట్వీట్ చేశారు.

**ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలకు ఉచిత ప్రయాణం**

కాగా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ఫ్రీ బస్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ ఉచిత బస్సు పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్జెండర్లు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చు. సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్ప్రెస్, ఎక్స్ప్రెస్ బస్సులో ఏదైనా తెలంగాణ గుర్తింపు కార్డు కండక్టర్కు చూపించి జీరో టికెట్ ద్వారా ప్రయాణం చేసే సౌకర్యం కల్పించారు.

### రేవంతన్న మాకు మంచిగ చేసిండు.. జై కొడుతున్న మహిళలు

ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. గతంలో రోజుకు 30 లక్షల మంది మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య దాదాపు 60 లక్షలకు చేరుకుంది. చాలా మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. దీంతో ఆర్టీసీకి ఆదాయంతో పాటుగా మహిళలకు టికెట్ డబ్బులు మిగులుతున్నాయి.

## యాదగిరిగుట్ట ఆలయంలో కుంగిన ఫ్లోరింగ్

### బయటపడుతున్న నాణ్యత లోపాలు..

### రిటైనింగ్ వాల్కు ఊడుతున్న బండలు





**మహా, హైదరాబాద్:** ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న తెలంగాణలోని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఫ్లోరింగ్ కుంగిపోయింది. అత్యున్నత ప్రమాణాలతో నిర్మించిన ఆలయంలో నిర్మాణ నాణ్యతా లోపాలు బయటపడతున్నాయి. తెలంగాణలోని ప్రముఖ పుణ్య క్షేత్రం యాదగిరి గుట్ట. తిరుమల పుణ్యక్షేత్రాన్ని తలపించేలా యదాద్రిని పునర్నిర్మించాలని గత కేసీఆర్ ప్రభుత్వం భావించింది. దీంతో కేసీఆర్ సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా 1200 కోట్ల రూపాయలతో యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాయాన్ని పునర్నిర్మించింది. కొద్దిపాటి వానకే నిర్మాణ లోపాలు బయటపడుతున్నాయి. తాజాగా దక్షిణ భాగం ప్రాకార మండప తిరువీధుల్లో 50 మీటర్ల మేర రెండు అంగుళాల లోతు వరకు ఫ్లోరింగ్ కుంగిపోయింది. గత ప్రభుత్వం 1.20 ఎకరాలు ఉన్న కొండను పూర్తిగా చదును చేయడంతో ప్రధానాలయ ప్రాంగణం 4.20 ఎకరాలకు విస్తరించింది. ఈ ప్రాంగణంలో స్వామివారి ప్రధానాలయంతో పాటు సప్తగోపురాలను నిర్మించారు. ఆలయం దక్షిణ భాగంలోని ప్రాకార మండపంలో వేసవిలో భక్తుల కాళ్ల కింద వాడిన మ్యాట్లు, వంట చెరకు వేయడంతో చెత్త పేరుకుపోయింది. అదేవిధంగా రిటైనింగ్ వాల్కు ఒక చోట బండలు ఊడిపోయాయి.

**కుంగిన కృష్ణశిలలు**

ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ దక్షిణ భాగంలో మట్టితో విస్తరించగా ప్రాకార మండపం వెలుపల ఉన్న ఫ్లోరింగ్ (నల్లరాతి శిలలు) సుమారు 50 మీటర్ల పొడవున రెండు అంగుళాల లోతుకు కుంగింది. విస్తరణ సమయంలోనూ ఇదే ప్రదేశంలో కుంగిపోగా అప్పట్లో మరమ్మతులు చేపట్టారు. రెండేళ్ల క్రితం కురిసిన కొద్దిపాటి వానకే ప్రధాన ఆలయంలోని దక్షిణ రాజ గోపురం పక్కన కృష్ణశిలతో ఏర్పాటు చేసిన ఫ్లోరింగ్ బండలు దాదాపు 10 మీటర్ల మేర 3 ఇంచుల కిందకి కుంగాయి. రాతిబండలు తొలగించి మరమ్మతులు చేశారు. గట్టినేల వచ్చే వరకు బోర్వెల్తో రంధ్రాలు చేసి అందులో సిమెంట్, కాంక్రీట్తో నింపారు. వాటిపై బండలతో ఫ్లోరింగ్ వేశారు. మరమ్మతులు చేసి రెండేళ్లు కూడా కాకముందే మళ్లీ ఫ్లోరింగ్ కుంగడంతోపాటు నాపరాళ్లు పగిలి మరోసారి నిర్మాణ లోపాలు బయటపడ్డాయి.

## ఎమ్మెల్సీ ఎన్నికలు

### కమలం వ్యూహమేంటి..?

- మూడు స్థానాల్లో బరిలోకి దిగుతుందా..?
- వ్యూహరచనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు
- అభ్యర్థుల ఎంపికపై స్పెషల్ ఫోకస్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత స్పీడ్ పెంచిన బిజేపీ.. పార్లమెంట్ ఎన్నికల్లో టాప్ గేర్ వేసి మంచి ఫలితాలను రాబట్టింది. అదే ఊపులో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. ఇందుకోసం మూడు ఎమ్మెల్సీ స్థానాలపై కన్నేసింది. ముందస్తు వ్యూహాలతో వార్ జోన్ లోకి దిగేసింది. ఇంతకీ కమలం పార్టీ వ్యూహమేంటి..? నేతల్లో జరుగుతున్న చర్చేంటో చూద్దాం. తెలంగాణాలో వచ్చే ఏడాది మార్చి నాటికి మూడు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. అందులో రెండు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలు కాగా ఒకటి గ్రాడ్యుయేట్ స్థానం. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీస్థానాలతో పాటు వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఇందు కోసం ఇప్పటికే ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది.

## భూటాన్తో ద్వైపాక్షిక సంబంధాలు

### మరో ముందడుగు

- దరంగా వద్ద 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్'
- ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- పొరుగుదేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిందే భారత్ అభిమతమన్న కేంద్ర మంత్రి
- చెక్ పోస్ట్తో పొరుగుదేశాలతో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్న బండి సంజయ్
- లాజిస్టిక్ ఖర్చులు కూడా ఆదా అవుతాయని పేర్కొన్న కేంద్ర మంత్రి



**హైదరాబాద్, మహా :** భారత్-భూటాన్ దేశాల మధ్య నేడు చారిత్రక పరిణామం చోటు చేసుకుంది. అసోంలోని దరంగా వద్దనున్న భూటాన్ సరిహద్దులో 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్' ప్రారంభమైంది. భూటాన్ ప్రధానమంత్రి శెరింగె తోబ్గే, అసోం గవర్నర్ ఆచార్య లక్ష్మణ్ ప్రసాద్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గరీటా చేతుల మీదుగా కొద్దిసేపటి క్రితం 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్'' ప్రారంభమైంది. ఈ చెక్ పోస్ట్ ఏర్పాటు వల్ల ఇరు దేశాల ప్రజల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. చెక్ పోస్టు ఏర్పాటుతో భారత్ కు లాజిస్టిక్ ఖర్చుల భారం చాలా మేరకు తగ్గనుంది. ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు మరింతగా పెరగనున్నాయి. వ్యాపార, వాణిజ్య, సేవా కార్యకలాపాలను సులభతరం కానుంది.


ఈ చారిత్రాక పరిణామం నేపథ్యంలో అసోంలోని దరంగా వద్ద ఏర్పాటు చేసిన 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టు' ప్రారంభ కార్యక్రమంలో కొద్దిసేపటి క్రితం కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రసంగిస్తూ... 'ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్' ప్రారంభంతో భారత్, భూటాన్ దేశాల బహుళ సంబంధాన్నిమరింత సన్నిహితం చేయడంతోపాటు ద్వైపాక్షిక సంబంధాలలో ప్రామాణికత ఏర్పడిందన్నారు. భారతభూటాన్ సంబంధాలు పరస్పర గౌరవం, సాంస్కృతిక సౌభ్రాతృత్వం, గొప్ప విశ్వాసం పైన నిర్మించబడ్డాయన్నారు. ఇరుదేశాల మధ్య స్నేహం, సహకారం, సామాజికత మన భాగస్వామ్యానికి ప్రబల సాక్ష్యమని పేర్కొన్నారు. ఇరు దేశాల భాగస్వామ్యం సహకార భద్రతా పునాదులు. నీటి వనరులు, విద్యుత్ ఉత్పత్తి, సమాచార, ఆరోగ్యం, సాంస్కృతిక మార్పిడి, వ్యవసాయం, అంతరిక్ష పరిశోధన మరియు విద్య వంటి కీలక రంగాలకు విస్తరించిందన్నారు. ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టు ఏర్పాటువల్ల రవాణా, వాణిజ్య తోడ్పాటు అందించడం మాత్రమే కాకుండా పొరుగున ఉన్న దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేయాలన్న భారత్ దృష్టికోణానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.హోంశాఖ పరిధిలోని ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(LPAI) సరిహద్దుల వద్ద అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునిక మౌలిక వసతులు కూడా అందిస్తుందన్నారు. అట్లాగే ప్రయాణికులకు, వ్యాపారులకు సౌకర్యవంతమైన, భద్రత, సమర్థవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తోందన్నారు. దరంగా ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్ ద్వారా పొరుగు దేశాలతో ఆర్థిక సహకార, సామాజిక సంబంధాల్లో నూతన అవకాశాలను సృష్టించేందుకు అవసరమైన డిజిటల్ మార్గాలను అన్వేషిస్తోందన్నారు.

సరిహద్దుల వ్యాపారంలో విప్లవాత్మక మార్పులకు, భద్రతను పెంచడానికి అత్యాధునిక వనరులను ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సమకూర్చిందన్నారు. అట్లాగే ల్యాండ్ పోర్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ (LPMS ) ద్వారా ఆన్లైన్ పార్కింగ్ రిజర్వేషన్, ఆటోమేటెడ్ స్టోరేజ్, సులభతర నియంత్రణ అనుమతులు వంటి సౌకర్యాలతో ల్యాండ్ పోర్ట్ కార్యకలాపాలను డిజిటైజ్ చేస్తుందన్నారు. ఇది కేవలం ఆపరేషనల్ సమర్థతను పెంచేదే కాకుండా, సరకు మరియు ప్రయాణికుల భద్రతను కూడా మెరుగుపరుస్తోందన్నారు.

ల్యాండ్ పోర్ట్ల విస్తరణ కేవలం రోడ్డు మార్గం వరకు పరిమితం కాదన్నారు. మల్టీమోడల్ కనెక్టివిటీకి మార్గం సుగమమైందన్నారు. రైల్వే, అంతర్రాష్ట్ర జల మార్గాలను రోడ్డుకు కనెక్ట్ చేసి పొరుగుదేశాలతో మరింత వాణిజ్య సామర్థ్యాన్ని పెంపొందించడమే ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా లక్ష్యమన్నారు. భవిష్యత్తులో భూమి, రైల్వే, జలమార్గాలను కలిపి సరిహద్దుల మధ్య సరకు, సేవలు నిరంతరం కొనసాగేలా మద్దతు ఇవ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. దీనివల్ల లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గుతాయన్నారు. 2030 నాటికి లాజిస్టిక్స్ పర్ఫార్మెన్స్ ఇండెక్స్లో ప్రస్తుత టాప్ 25 దేశాల జాబితాలో చేరాలన్న ప్రభుత్వ విజన్ కు కూడా నేటి కార్యక్రమం బలాన్ని ఇస్తుందన్నారు.

## రేవంత్ సంకల్పం

### మూసీ పునరుజ్జీవ సంకల్ప యాత్ర



**హైదరాబాద్, మహా:**

- శుక్రవారం ఉదయం 9 గంటలకు బేగంపేట్ నుంచి హెలికాప్టర్ లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి యాదగిరి గుట్టకు బయలుదేరుతారు.
- 10 గంటలకు లక్ష్మీ నరసింహస్వామి దర్శనం, పూజ
- 11.30కు యాదగిరి గుట్ట టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ, ఆలయ అభివృద్ధి కార్యకలాపాలపై ముఖ్యమంత్రి సమీక్ష
- 1.30 కి రోడ్డు మార్గంలో సంగెం. సంగెం నుంచి మూసీ నది పునరుజ్జీవన సంకల్పం.
- సంగెం నుంచి మూసీ పాదయాత్ర ప్రారంభం మూసీ నది కుడి ఒడ్డున భీమలింగం వరకు దాదాపు 2.5 కిలో మీటర్ల పాదయాత్ర.
- అక్కడి నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కెనాల్ కట్ట వెంబడి సంగెం నాగిరెడ్డిపల్లి రోడ్డు వరకు పాదయాత్ర
- పాదయాత్ర అనంతరం అక్కడే యాత్ర ను ఉద్దేశించి మూసీ పునరుజ్జీవ సంకల్ప రథం పై నుంచి ముఖ్యమంత్రి ప్రసంగంఅనంతరం హైదరాబాద్కి తిరుగు ప్రయాణం

## కేసీఆర్ రీ ఎంట్రీ!

### ఇక బీఆర్ఎస్ 2.0

- కాంగ్రెస్పై కాలుదువ్వుడే..
- త్వరలో ప్రజల్లోకి గులాబీ బాస్
- కొత్త సంవత్సరం.. కొత్త కమిటీలు
- ఆ నియోజకవర్గాల్లో కొత్త ఇన్చార్జీల నియామకం
- సిద్ధమవుతున్న గులాబీ దండు



**(మహా, హైదరాబాద్):** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కాంగ్రెస్పై కాలుదువ్వుతున్నారా..? త్వరలో పోరుబాట పట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి పార్టీ వర్గాలు. ఇందుకు మొదటగా కొత్త సంవత్సరం.. కొత్త కమిటీలు ఏర్పాటు చేసి.. ప్రజల్లోకి రానున్నట్లు పార్టీవర్గాల సమాచారం. ముఖ్యంగా పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కొత్త ఇన్ఛార్జిల నియామకం చేయనున్నట్లు తెలుస్తోంది. యువ రక్తానికి పార్టీలో పదవులు ఇవ్వనున్నారని, కొత్త సంవత్సరం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై సమరానికి సిద్ధం కానున్నారని, అందుకు ఏర్పాట్లు బిరాబిరా జరుగుతున్నాయని సమాచారం.

**దాదాపు ఏడాది పూర్తి..**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి దాదాపు ఏడాది దగ్గరకు వస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే.. కొత్త సర్కారుకు ఓ ఏడాది టైమ్ ఇద్దాం.. ఆ తర్వాత ప్రభుత్వ పనితీరుపై స్పందిద్దాం అని కేసీఆర్ బీఆర్ఎస్ నేతల సమావేశంలో వ్యాఖ్యానించారు. ఏడాది కావడంతో.. కేసీఆర్ రంగంలోకి దిగబోతున్నారు.

**చాలా రోజులుగా ఫాంహౌస్కే పరిమితం..**

తెలంగాణ రాజకీయాల్లో మాజీ సీఎం కేసీఆర్ యాక్టివ్గా లేక చాలా రోజులు అయ్యింది. ఇటీవల తెలంగాణలో ఎంత పెద్ద ఇష్యూ వచ్చినా కేసీఆర్ మాత్రం ఎక్కడా స్పందించలేదు. కేసీఆర్ రెస్ట్ తీసుకుంటున్నారని చాలామంది కామెంట్ చేశారు. ఈ నేపథ్యంలో.. అతి త్వరలోనే కేసీఆర్ గ్రాండ్గా రీ ఎంట్రీ ఇస్తారని బీఆర్ఎస్ పార్టీలో టాక్ నడుస్తోంది.

**రంగంలోకి గులాబీ బాస్..**

2025 జనవరి నుంచి గులాబీ బాస్ రంగంలోకి దిగుతారని.. బీఆర్ఎస్ కీలక నేత ఒకరు చెప్పారు. కొత్త సంవత్సరం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై సమరానికి కేసీఆర్ సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు. జనవరి నుంచి బీఆర్ఎస్ 2.0 ను తెలంగాణ ప్రజలు చూస్తారని కేసీఆర్కు నమ్మినబంటుగా ఉన్న నాయకుడు వివరించారు. ప్రభుత్వంపై కొట్లాడడానికే కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లనున్నారని వ్యాఖ్యానించారు.

**కొత్త కమిటీలు..**

కొత్త సంవత్సరం నుంచి కొత్త కమిటీలు వేసే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్టు సమాచారం. అదేవిధంగా.. బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలిచి.. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కొత్త ఇంఛార్జ్లను నియమించనున్నట్టు తెలుస్తోంది. పార్టీలో యువతకు పదవులు ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది.

**కేసీఆర్ రెస్ట్..**

2024 పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోరంగా ఓడిపోయింది. కనీసం ఉనికిని చాటుకోలేకపోయింది. అప్పటి నుంచి ఒకట్రెండు సందర్భాలు మినహా.. కేసీఆర్ ఎక్కడా బయట కనిపించలేదు. దీంతో కేసీఆర్ ఇక రెస్ట్ తీసుకుంటారు.. పార్టీని కేటీఆర్, హరీశ్ రావు నడిపిస్తారనే కామెంట్స్ వినిపించాయి.

**జిల్లాల నేతలతో సమావేశం..**

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత.. కేసీఆర్ జిల్లాల నేతలతో సమావేశం అవుతున్నారు. పార్టీని వీడుతున్న లీడర్ల గురించి చర్చిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు ఏమనుకుంటున్నారని ఆరా తీస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు లోకల్ బాడీ ఎలక్షన్స్లో జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారని.. బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

**ప్రజల్లో అసహనం..**

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇప్పుడిప్పుడే ప్రజల్లో అసహనం వ్యక్తం అవుతోందని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అది ఇంకాస్త పెరిగాక.. సరైన ఇష్యూపై ఘాటుగా స్పందించాలని కేసీఆర్ వెయిట్ చేస్తున్నట్టు సమాచారం. అదే కాకుండా.. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కూడా కాలేదు. అప్పుడే విమర్శలు, ఆరోపణలు చేస్తే.. బాగుండదనే అభిప్రాయంలో కారు పార్టీ చీఫ్ ఉన్నట్టు బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ హామీల అమలు, ఇతర వైఫల్యాలపై ప్రశ్నిస్తూ.. ఓ భారీ కార్యక్రమం ద్వారా కేసీఆర్ రీ ఎంట్రీ ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

**కేసీఆర్కు సమాచారం..**

క్షేత్రస్థాయిలో ఏం జరుగుతున్నా.. కేసీఆర్కు సమాచారం వస్తుందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. పదేళ్లు ప్రభుత్వ చీఫ్గా ఉన్న కేసీఆర్కు కొందరు సపోర్ట్ చేస్తున్నారనే టాక్ ఉంది. అందుకే.. ప్రస్తుత ఇంటలిజెన్స్ అధికారులు కీలక సూచనలు ఇచ్చారు. సీఎం పేషీ, సెక్యూరిటీ, ఇతర కీలక బాధ్యతల్లో గతంలో కేసీఆర్కు దగ్గరగా పనిచేసిన వారిని నియమించొద్దని స్పష్టం చేశారు. దీంతో చాలామంది అధికారులను మార్చారు.

# ఎదురులేని సీఎం రేవంత్

## ఉద్యోగాల భర్తీలో..



(మొదటిపేజీ తరువాయి)

300 రోజుల పాలన సూపర్ సక్సెస్ కావడమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. సబ్బండ వర్ణాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. అభివృద్ధికి పెద్దపీట వేస్తూ.. ఎక్కడా మచ్చలేకుండా.. సంపూర్ణ పారదర్శంగా సాగిన తీరే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

### సబ్బండ వర్గాల సంక్షేమం

ప్రభుత్వాలు మారుతుంటాయి. ముఖ్యమంత్రులు మారుతుంటారు. కానీ కొన్ని ప్రభుత్వాలు మాత్రమే ప్రజా ప్రభుత్వాలుగా చరిత్రలో నిలిచిపోతాయి. కొందరు ముఖ్యమంత్రులు మాత్రమే చరిత్రలో తమకంటూ ప్రత్యేకపేజీని లిఖించుకుంటారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కోవలో వెళ్తోంది. ముఖ్యంగా ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... నాటి వైఎస్ పాలనను గుర్తుచేస్తూ అన్నివర్గాల ప్రశంసలు పొందుతున్నారు. రాష్ట్రంలోని యంత్రుత్వ పాలనను అంతం చేసి, అద్భుతమైన ప్రజాస్వామ్య పాలనను అందిస్తోంది కాంగ్రెస్ సర్కారు. రేవంత్ 300 రోజుల పాలన సూపర్ సక్సెస్ కావడమే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. సబ్బండ వర్ణాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ.. ఎక్కడా మచ్చలేకుండా.. సంపూర్ణ పారదర్శంగా సాగిన తీరే అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. రాష్ట్రంలోని అన్ని వర్గాలను ఆకట్టుకునేలా కాంగ్రెస్ పాలన దూసుకుపోతుంది. ఈ 300 రోజుల పాలనలో అన్ని వర్గాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేరువైంది. ఆరు గ్యారంటీలను అమలు చేసి తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని రేవంత్ సర్కార్ చాటుకుంది. ఓవైపు పథకాలు మరోవైపు సంక్షేమం అంటూ ముందుకు సాగుతుంది. ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ అందరి మనసులను గెలుచుకుంది కాంగ్రెస్ సర్కార్.

### అందరివాడు

అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ అందరివాడుగా సీఎం రేవంత్ పేరు తెచ్చుకుంటున్నారు. రేవంత్ తో పాటు మంత్రులు కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు సమావేశాలతో అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేస్తూ.. పాలనలో తమ మార్క్ చూపిస్తున్నారు. మాట తప్పని మడమ తిప్పని నిర్ణయాలతో హామీలను అమలుచేస్తున్న సీఎం రేవంత్ ను సబ్బండ వర్గాల గుండెల్లో పెట్టుకుంటున్నారు. యావత్ తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలతో కాంగ్రెస్ సర్కారు కొలువు దీరింది. రేవంత్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తున్నాయి. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి డిసెంబర్ 7వ తేదీన అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సంక్షేమం, అభివృద్ధే తన ఎజెండాగా ముందుకు సాగుతున్నారు. ప్రజలతో మేకమవుతూ... వారి కష్ట, సుఖాల్లో తోడునీడగా కొండంత నిలుస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రిజర్వేషన్ల వివాదాలు, ఫలితాల నిలిపివేతలు, కోర్టు కేసులను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అధిగమిస్తోంది. అందులో భాగంగానే టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసింది. ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు భరోసానిచ్చి మాట నెలబట్టుకుంది రేవంత్ సర్కార్. ఈ 300 రోజుల్లోనే వేలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందించింది. మెడికల్ అండ్ హెల్త్ రిక్రూట్మెంట్ బోర్డు, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు, టిఎస్పిఎస్సి, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఈ నియామకాలను ప్రభుత్వం చేపట్టింది. వీటికి అదనంగా సింగరేణిలో కారుణ్య నియామకాలు కల్పించింది. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన వ్యవస్థలను ప్రజలకు చాటిచెప్పేందుకు రాష్ట్రంలో ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. విద్యుత్ విభాగంలో జరిగిన అవినీతి అక్రమాలు అవకతవకలను అసెంబ్లీలోనే వెల్లడించింది. ఇరిగేషన్ విభాగంపై శ్వేతపత్రాలను విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన ఘటనపై విజిలెన్స్ విచారణ చేపట్టడంతో పాటు నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర జలసంఘానికి లేఖ రాసింది. ముఖ్యమంత్రి, మంత్రులతో పాటు అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన పిల్లర్లను పరిశీలించింది. ఎనిమిదేళ్లుగా కేంద్రం వద్ద పెండింగ్లో ఉన్న సమస్యకు సి ఎం రేవంత్ రెడ్డి చేసిన కృషికి కేంద్ర రక్షణ శాఖ స్పందించింది. కంటోన్మెంట్ ఏరియాలో రక్షణ శాఖ భూములపై కారిడార్ల నిర్మాణానికి ఆమోదముద్ర వేసింది. మొహిదీపట్నంలో స్కై వాక్ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న రక్షణ భూముల అప్పగింతకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్ 2 విస్తరణకు ఫరూక్ నగర్ వద్ద ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఫేజ్ 2లో మొత్తం 70 కిలోమీటర్ల కొత్త మెట్రో రైలు మార్గాన్ని నిర్మించనున్నారు. రూ.2,700 కోట్ల తో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఐటీఐలలో అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుపై టాటా టెక్నాలజీస్ లిమిటెడ్తో ఒప్పందం చేసుకున్నది. దావోస్లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పెట్టుబడులను ఆకర్షించటంలో తెలంగాణ సరికొత్త రికార్డును సాధించింది. దాదాపు రూ.40,232 కోట్ల పెట్టుబడులు, 30 వేల ఉద్యోగాల కల్పనకు భరోసాను తీసుకొచ్చింది.

వీటితో పాటు 300 ఎకరాల్లో జీనోమ్ వ్యాలీ ఫేజ్ 2 త్వరలోనే ప్రారంభిస్తామని బయో ఆసియా 2024 సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో 5 లక్షల మందికి ఉద్యోగాలను కల్పిస్తామని భరోసాను కల్పించడంతో పాటు వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాల్లో గ్రీన్ ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేసేలా ఈ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం విశేషం. నేరుగా రైతుల సమస్యల ను పరిష్కరించేందుకు ప్రభుత్వం వినూత్నంగా రైతునేస్తం కార్యక్రమం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,601 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేసింది. హైదరాబాద్ లో ప్రపంచ పర్యాటక ప్రాంతంగా మూసీ పునరుజ్జీవం, పరీవాహక ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు, డిజైన్లు, ప్రతిపాదనలను ప్రభుత్వం సిద్ధం చేసింది. హైదరాబాద్లో డ్రగ్స్ చలామణిపై ఉక్కుపాదం మోపింది.

నార్కోటిక్స్ నియంత్రణ. టి ఎస్ నాబ్ ను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ తరహాలో పటిష్టం చేయాలని నిర్ణయించింది. సింగరేణి ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమాను వర్తింపచేయడంతో పాటు 43 వేల మంది కార్మికులకు అది వర్తించేలా కోటి రూపాయల ప్రమాద బీమాను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిం ది. పారిశ్రామిక అభివృద్ధికి మెగా మాస్టర్ ప్లాన్ 2050ను రూపొందిస్తోంది. ఇండియన్ నేవీ రాడార్ స్టేషన్. వికారాబాద్ ఫారెస్ట్ ఏరియాలో దేశంలో రెండో విఎల్ఎఫ్ స్టేషన్ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

## అసాధ్యుడు

ఆరు గ్యారెంటీల అమలు కష్టమేనన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది రేవంత్ సర్కారు. ఆరు నూరైనా వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా నిరంతరం ఆయన కృషి చేస్తున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లోని 13 హామీల్లో ఇప్పటికే 5 ప్రారంభం కాగా, మరిన్ని పథకాలు అమలుకు ప్రభుత్వం అద్భుతమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్తోంది. సీఎం రేవంత్ రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టగానే డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అధికారం చేపట్టిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కాంగ్రెస్ సర్కారు కల్పించింది. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచింది. మహాలక్ష్మి పథకంలో కేవలం 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసే పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. అర్హులైన పేద కుటుంబాలకు ఉచిత గృహ విద్యుత్ ను అందించే గృహ జ్యోతి పథకాన్ని ప్రారంభించింది. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులకు జీరో బిల్లు జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించింది. రూ.22,500 కోట్లతో 4, 50,000 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరయ్యాయి. అర్హులైన నిరుపేదలకు సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సాయం, గూడు లేని వారికి ప్రభుత్వ స్థలంతో పాటు ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.




## అప్పుల తిప్పలు అధిగమిస్తూ

ఆరు గ్యారంటీలకు సుమారు రూ.80 వేల కోట్లు అవసరమవుతుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చింది. ఒకవైపు పాత అప్పులకు అసలు, వడ్డీ చెల్లింపులకు రాష్ట్ర స్వీయ పన్నుల వసూళ్లలో దాదాపు 35 శాతం వెచ్చిస్తోంది. ప్రస్తుతం నిధుల లేమి నెలకొన్నా, హామీలు ఆలస్యమైనా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేయడంలో హస్తం ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్న మాట బలంగా వినిపిస్తోంది. అంతేకాదు నేనున్నానంటూ ప్రజలకు భరోసా ఇవ్వడంతో రేవంత్ రెడ్డి విజయవంతం అయ్యారని అందరూ ప్రశంసలు కురిపిస్తుండడం విశేషం. మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 చొప్పున మహాలక్ష్మి ఆర్థిక సాయం, రైతు భరోసా పేరుతో రైతులు, కౌలు రైతులకు ఏటా రూ. 15,000 పంట పెట్టుబడి సాయం, రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12,000ల సాయం, వరి పంటకు క్వింటాల్కు రూ. 500 చొప్పున బోనస్ ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం, ప్రస్తుతం ఉన్న రూ. 2,016 పింఛనును చేయూత పేరుతో నెలకు రూ. 4,000కు పెంపు, విద్యార్థులకు రూ. 5 లక్షల చొప్పున విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు వంటివి రానున్న రోజుల్లో అమలు చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకెళుతోంది.

## ప్రగతికి శ్రీకారం

నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసింది రేవంత్ ప్రభుత్వం. మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలకు భూమిపూజను చేసింది. గద్దర్ విగ్రహం ఏర్పాటుతో పాటు కవులు కళాకారులు సినీ ప్రముఖులకు గద్దర్ పేరు మీద అవార్డులను ఇవ్వాలని నిర్ణయించింది. రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు శంకుస్థాపనతో పాటు హుస్సేన్ సాగర్ చుట్టూ దుబాయ్ మోడల్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించింది. ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్కు రూ.2 కోట్ల పారితోషకం అందించి ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోంది. దీంతోపాటు స్వయం సహాయక సంఘాలకు చేయూతగా కొత్త కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఉర్దూ అకాడమీ ఏర్పాటుతో పాటు ఎన్ఆర్ఎస్సీతో స్టేట్ ఏవియేషన్ అకాడమీ ఒప్పందం చేసుకొని డ్రోన్ పైలట్లకు శిక్షణ అందించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. వాహనాల రిజిస్ట్రేషన్ల నెంబర్లో ఉండే టిఎస్ ను టిజిగా మార్చి తెలంగాణ వాసుల చిరకాల కోరికను నెరవేర్చింది.

## ప్రజావాణి

ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదుల్లో ఎక్కువగా భూములకు, ఉద్యోగాలకు సంబంధించినవే కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణి ద్వారా భూములపై హక్కులు కోల్పోయిన పేదలు, రైతులకు పరిష్కారం కనుగొనడానికి నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయి అధ్యయనం చేసిన ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎమ్మార్వో మొదలు కలెక్టర్ స్థాయి వరకు పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. త్వరలో పలు మార్పులతో ధరణి స్థానంలో భూమాత ఉనికిలోకి రానుంది. కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి వాటా తేలేంత వరకు ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించే ప్రసక్తే లేదని అసెంబ్లీలో వేర్వేరు తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. రీజనల్ రింగు రోడ్డు దక్షిణ భాగానికి అప్రూవల్ తెచ్చుకొని పడకేసిన ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి అడుగు ముందుకేసింది. హైడ్రా, మూసీ ప్రక్షాళన నిర్ణయాలతో సీఎం రేవంత్ మరింత దూకుడు పెంచారు. చెరువుల పరిరక్షణకు నడుం బిగించారు. తాజాగా కులగణన దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది.

## అవినీతికి దూరంగా.. ప్రజలకు దగ్గరగా

అన్నింటికి మించి రేవంత్ రెడ్డి 300 రోజుల పాలనకు కాంగ్రెస్ పెద్దలు అచ్చెరువొందారు. అవినీతికి ఆమడదూరంలో ఉంటూ పారదర్శక పాలనందిస్తున్న సీఎం రేవంత్ ప్రజా పాలనకు ఫిదా అయ్యారు. ప్రజాపాలన అంటే ఎలా ఉండాలో రేవంత్ రెడ్డి చేసి చూపిస్తుండడంతో పార్టీ పెద్దలు ఆయనపై ఫుల్ ఖుషీగా ఉన్నారు. ఇలాంటి యువ ముఖ్యమంత్రికి అన్నివిధాల అండగా ఉంటూ కొండంత అండగా నిలుస్తున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులపై దూకుడుగా విమర్శలు చేసే రేవంత్ పాలనలో మాత్రం ప్రతీకార రాజకీయాలకు చోటివ్వకపోవడం ఆయన రాజకీయ పరణతికి, వ్యూహచతురతకు తార్కాణంగా రాజకీయ పండితులు వర్ణిస్తున్నారు. దమ్మున్న సీఎంగా, తిరుగులేని ప్రజానేతగా మన్ననలందుకుంటున్న

రేవంత్ రెడ్డికి మహాపత్రిక తరుపున జన్మదిన శుభాకాంక్షలు.



# ఒకే ఒక్కడు

**తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని మహామహులు సైతం అధికారంలోకి తీసుకురాలేకపోయారు. ఆజానుబాహులు కూడా చేతులెత్తేశారు. కేసీఆర్ తో అంత ఈజీ కాదంటూ సీనియర్లు అస్త్రసన్యాసం చేసేశారు. కానీ అలాంటి తరుణంలో ఒకే ఒక్కడు మాత్రం హస్తం పార్టీకి కొత్త తోవను చూపించాడు. నైరాశ్యంలో కూరుకుపోయిన కాంగ్రెస్ శ్రేణులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చాడు. అన్నీ తానై, అన్నింటా తానై, అన్నివర్గాలను ఏకతాటిపైకి తెచ్చి తెలంగాణలో కాంగ్రెస్ పవర్ లోకి తీసుకొచ్చిన ఆ విజయ సారథే రేవంత్ రెడ్డి. సీఎంగా 330 రోజుల పాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న ఈ తెలంగాణ ఆశాకిరణం.. ముఖ్యమంత్రి హోదాలో తొలి పుట్టినరోజు జరుపుకుంటున్న సందర్భంగా మహాపత్రిక ప్రత్యేక కథనం**

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనం రేవంత్ రెడ్డి. ఆ మాటకొస్తే రాష్ట్ర రాజకీయాలనే తనవైపు తిప్పుకున్న సక్సెస్ ఫుల్ లీడర్. మాటల్లో స్పష్టత, చేతల్లో చురుకుదనం, ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే మాటకారితనం అన్నింటికి మించి అధిష్టానం ఆశీస్సులు ఇవన్నీ రేవంత్ రెడ్డికి కలిసొచ్చాయి. ముఖ్యమంత్రి పీఠంవైపు ఆయనను నడిపించాయి. రేవంత్ రెడ్డి జీవితం వడ్డించిన విస్తరి కాదు. కష్టాల సుడిగుండాలను ఎదురీది పైకొచ్చారాయన. ముఖ్యంగా రాజకీయాల్లో ఆయన ఎన్నో ఢక్కా మొక్కీలను తట్టుకుని పైకొచ్చారు. రేవంత్ రెడ్డి జీవితం ఆర్ఎస్ఎస్ తో మొదలైంది. ఆ తర్వాత ఆయన టీఆర్ఎస్ కు దగ్గరయ్యారు. 2004లో కల్వకుర్తి టికెట్ ఆశించినా.. అప్పటి రాజకీయ సమీకరణాలతో ఆయనకు టికెట్ రాలేదు. కానీ అక్కడే ఆయన జీవితం మలుపు తిరిగింది. మహబూబ్ నగర్ జిల్లా మిడ్జిల్ నుంచి జడ్పీటీసీగా బరిలో నిలిచి గెలిచారు. ఆ తర్వాత 2007లో ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఇండిపెండెట్ గా విజయం సాధించారు. అప్పటి అధికార కాంగ్రెస్ నుంచి ఆహ్వానం అందినా... దాన్ని తిరస్కరించి... ప్రతిపక్ష పార్టీ అయిన టీడీపీలో చేరారు. ఆ తర్వాత ఆయన వెనుదిరిగి చూసుకునే అవకాశం లేకుండా పోయింది. టీడీపీలో చేరిన అతి తక్కువ కాలంలోనే మంచి వాయిస్ ఉన్న నేతగా గుర్తింపు పొందారు రేవంత్ రెడ్డి. ఫైర్ బ్రాండ్ పొలిటిషియన్ గా పేరు తెచ్చుకున్నారు. ఎమ్మెల్సీగా శాసనమండలిలో బలమైన గొంతుకను వినిపించారు. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ.. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా పేరు పొందారు. టీడీపీ తరపున టీఆర్ఎస్ కు బలమైన కౌంటర్లు ఇస్తూ.. అప్పటి అధికార పార్టీ నాయకుల ప్రశంసలు కూడా అందుకోవడం రేవంత్ కే సాధ్యమైంది. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కొడంగల్ నుంచి బరిలో నిలిచారు. చివరి నిమిషంలో టీడీపీ టికెట్ దక్కినా.. తానేంటో నిరూపించుకునేందుకు అదే అవకాశంగా భావించారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతో విజయలక్ష్మి ఆయననే వరించింది. కొడంగల్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత రేవంత్ రెడ్డి మరింత వేగంగా ఎదిగారు. టీడీపీలో కీలక నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా, అనుంగు అనుచరుడిగా మారారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీ తరపున టీఆర్ఎస్ కు ఢీ అంటే ఢీ అన్నారు. ఒకదశలో కేసీఆర్ కు కూడా ధీటైన కౌంటర్లు ఇచ్చి, రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్యపరిచారు. తెలంగాణకు టీడీపీ వ్యతిరేకం కాదన్న వాదనను బలంగా వినిపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీటీడీపీ సీనియర్లు కూడా మాట మాట్లాడానికి వెనుకాడుతున్న తరుణంలో.. రేవంత్ రెడ్డి మాత్రం పార్టీ వాదనను ప్రతి ఇంటికీ చేర్చారు. ఇదే ఆయనను చంద్రబాబుకు మరింత దగ్గర చేసింది. 2009 నుంచి 2014 వరకు టీవీ డిబేట్లలో ప్రతిరోజూ రేవంత్ రెడ్డే కనిపించేవారు. తెలుగుదేశం పార్టీకి చుక్కానిలా పనిచేశారు. చివరకు తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను గురించి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది. ఈ తరుణంలోనే ఎన్నికలొచ్చాయి. 2014లో మరోసారి కొడంగల్ నుంచి బరిలో నిలిచారు. టీడీపీ తరపున ఎమ్మెల్యేగా వరుసగా రెండోసారి విజయం సాధించారు. అయితే మారిన రాజకీయ పరిస్థితులతో టీడీపీ ఎమ్మెల్యేలంతా ఒక్కొక్కరుగా గులాబీగూటికి చేరారు. చివరకు రేవంత్ ఒంటరిగా మిగిలిపోయినప్పటికీ, అధికార టీఆర్ఎస్ కు ముచ్చెమటలు పట్టించారు. ఓటుకు నోటు కేసుతో రేవంత్ రెడ్డి పని అయిపోయిందని కేసీఆర్ భావించారు. కానీ అక్కడే రేవంత్ రెడ్డి పొలిటికల్ లైఫ్ మరో టర్న్ తీసుకుంది. జైలు జీవితం రేవంత్ లో మరింత కసిని పెంచింది. ఏదో సాధించాలన్న కసి ఆయనలో మరింత పెరిగింది. ఆ తర్వాత రేవంత్ రెడ్డి టీడీపీని వీడడం.. కాంగ్రెస్ కు దగ్గర కావడం ఇవన్నీ చకచక జరిగిపోయాయి. అయితే హస్తం పెద్దలకు రేవంత్ రెడ్డి సామర్థ్యం ఏంటో తెలుసు. అందుకే కాంగ్రెస్ లోకి రావడం రావడమే వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు అప్పజెప్పింది హైకమాండ్. ఈలోపే 2018 అసెంబ్లీ ఎన్నికలొచ్చాయి. ఆ ఎన్నికల్లో కొడంగల్ నుంచి మూడోసారి బరిలో నిలిచారు. గులాబీపెద్దలు సామదాన దండోపాయాలతో ప్రత్యేకదృష్టి పెట్టడంతో అనూహ్యంగా ఆయన ఓడిపోవాల్సి వచ్చింది. ఆ పరాజయం తర్వాత ఆయన ప్రత్యర్థులు రేవంత్ రెడ్డి పనైపోయిందని భావించారు. కానీ అలా అయితే ఆయన రేవంత్ రెడ్డి ఎందుకవుతారు. సమయం కోసం ఆయన ఎదురుచూశారు. ఎంపీ ఎన్నికలరూపంలో మరో గొప్ప అవకాశం ఆయనకు లభించింది. కాంగ్రెస్ అధిష్టానం పెద్దలు పిలిచి మరీ రేవంత్ కు సీటు ఇచ్చారు. మల్కాజ్ గిరి నుంచి ఎంపీగా బరిలో దిగారు రేవంత్ రెడ్డి. మారిన రాష్ట్ర రాజకీయ పరిస్థితులు... రేవంత్ రెడ్డికి వ్యక్తిగతంగా ఉన్న ఛరిష్మాతో ఒక్క ఎమ్మెల్యే కూడా లేని మల్కాజ్ గిరి పార్లమెంటు సెగ్మెంట్ లో సత్తా చాటారు. ప్రజా సమస్యల కోసం పార్లమెంటు లో గొంతెత్తే దమ్ము, ధైర్యం ఒక్క రేవంత్ రెడ్డికే ఉందని మల్కాజ్ గిరి ఎంపీ నియోజకవర్గ ఓటర్లు బలంగా నమ్మారు. దీంతో రేవంత్ రెడ్డి విజయఢంకా మోగించారు. ఈ విజయంతో అధికార బీఆర్ఎస్ కోటలో ఎంపీగా గెలిచి... తాను ఎందుకో స్పెషల్ మరోసారి చాటిచెప్పారు రేవంత్ రెడ్డి.

## సరైన సమయంలో సరైన నిర్ణయాలు

ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన తర్వాత కాంగ్రెస్ పెద్దలకు రేవంత్ రెడ్డి మరింత దగ్గరయ్యారు. అధికార బీఆర్ఎస్ కు ఢీ అంటేఢీ అనే నాయకుడు రేవంతేనని, ఆ శక్తి సామర్థ్యాలు ఆయనకే ఉన్నాయని వారు కూడా బలంగా నమ్మారు. ఎందుకంటే ఆ సమయంలో పార్టీ కష్టకాలంలో ఉంది. నిరాశలో కూరుకుపోయిన హస్తానికి కొత్త జవసత్వాలు అద్దే నాయకుడి కోసం పార్టీ శ్రేణులు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇది గుర్తించిన హైకమాండ్.. రేవంత్ రెడ్డి వైపు మొగ్గు చూపింది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంది. పార్టీ సీనియర్ నాయకులు, నేతల సహకారం అంతకుమించి పార్టీ పెద్దల ఆశీస్సులు కలిసొచ్చాయి. రేవంత్ రెడ్డి ఏకంగా పీసీసీ చీఫ్ అయ్యారు. రేవంత్ రెడ్డి పీసీసీ అయిన తర్వాత కేసీఆర్ ను గద్దె దించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. గులాబీ సర్కారు వైఫల్యాలను గట్టిగా ఎండగట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఏ క్షణాన పీసీసీ చీఫ్ అయ్యారో కానీ అప్పుడే కేసీఆర్ కు బ్యాడ్ టైమ్ మొదలైంది. అప్పటిదాకా ఒక్క లెక్క.. రేవంత్ రెడ్డి పీసీసీ అయినంత మరో లెక్క అన్నట్లుగా వాతావరణం మారింది. పార్టీకి ఏం అవసరమో రేవంత్ రెడ్డి గుర్తించారు. పార్టీలోని గ్రూపులన్నింటినీ ఒక్కతాటిపైకి తెచ్చారు. నేనున్నానంటూ క్యాడర్ కు భరోసా ఇచ్చారు. దీంతో హస్తం శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చింది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర కాంగ్రెస్ కు సంజీవనిలా పనిచేసింది. కేసీఆర్ కు కౌంటర్ ఇవ్వలేని స్థితిలో ఉన్న హస్తానికి... బీఆర్ఎస్ ను నిలువరించే సత్తా ఒక్క కాంగ్రెస్ కే ఉందని నిరూపించగలిగారు రేవంత్ రెడ్డి. ఎన్నికలకు ముందే పక్కా ప్లానింగ్, విజన్ ను ఫాలో అయ్యారు రేవంత్ రెడ్డి. ముఖ్యంగా గ్రూపులుగా విడిపోయిన సీనియర్లందరినీ ఒక్కతాటిపైకి తెచ్చారు. విడిపోయిన కొట్లాడడం కంటే కలిసుండి.. కేసీఆర్ పై ఫైట్ చేయాల్సిన ఆవశ్యతను అందరికీ వివరించి చెప్పారు. కేసీఆర్, కేటీఆర్ కు ధీటుగా ప్రచార అస్త్రాలను బయటకు తీశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్సేనన్న అంశాన్ని అందరికీ వివరించారు. ఆరు గ్యారెంటీలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ సర్కారు అవినీతిపై హాట్ డైలాగులతో జనాన్ని ఆకట్టుకున్నారు. కేసీఆర్ ఒక్కమాటంటే తగ్గేదే అంటూ రేవంత్ రెడ్డి కూడా ఢీ అంటే ఢీ అన్నారు. కేసీఆర్ ను మించి రేవంత్ కు ప్రజాదరణ లభించింది. కేసీఆర్ మీటింగులకు జనం సప్పగా వస్తుంటే.. అదే సమయంలో రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికెళ్లినా జన నీరాజనం లభించింది. జనసునామీ పోటెత్తింది. రేవంత్ రెడ్డి రాక కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు పోటీపడాల్సి వచ్చింది. అందుకే టైట్ షెడ్యూల్ ను దాదాపు అన్ని నియోజకవర్గాలను కవర్ చేశారు.

## అంతా తానై

**కేసీఆర్ కు ధీటుగా రేవంత్ రెడ్డి సుడిగాలి ప్రచారం చేశారు. ప్రజాకర్షణ కలిగిన రేవంత్ తో కాంగ్రెస్ ఒక్కసారిగా రేసులోకి వచ్చేసింది. కాంగ్రెస్ కు అన్నీతానై ముందుండి నడిపించి, కొత్త దశ, దిశను చూపించారు. ఇంటింటికీ కాంగ్రెస్ ను చేర్చడంలో కీలకపాత్ర పోషించారు. బీఆర్ఎస్ కు ఎప్పటికప్పుడు ధీటైన కౌంటర్లు ఇచ్చి, వారెవ్వా అనిపించుకున్నారు. గులాబీ పార్టీకి చెక్ పెట్టేందుకు పదునైన వ్యూహాలతో ముందుకు సాగారు. ప్రచారంలో ఏ రోజుకు ఆరోజే కేసీఆర్, కేటీఆర్ కు మూతోడ్ జవాబిచ్చి అదరగొట్టిన ఘనత రేవంత్ రెడ్డిది. అవసరమైన చోట హాట్ డైలాగులతో కేక పుట్టించారు కూడా. అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీకి కౌంటర్లు ఇచ్చి దుమ్మురేపారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కతాను ముక్కలేనంటూ చురకలంటిస్తూ ప్రజలనాడిని పట్టుకున్నారు. కాంగ్రెస్ ను ఆకాశమంత ఎత్తుకు చేర్చి, తనకు ఎదురులేదని తన సత్తా ఏంటో నిరూపించుకున్నారు. ముఖ్యంగా యూత్ లో ఆయనకు ఎనలేనిక్రేజ్ వచ్చింది. అన్నివర్గాల ప్రజలు ఆయనను ఒక ఆశాకిరణంగా చూశారు. కేసీఆర్ మాటలకు ధీటైన కౌంటర్ ఇచ్చే మొనగాడు రేవంత్ రెడ్డేనని అందరూ భావించారు. ముఖ్యంగా కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి రేవంత్ రెడ్డి పోటీచేయడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సీట్లో పోటీ చేయడం ద్వారా కేసీఆర్ కు ధీటైన ప్రత్యర్థి, ఆయనతో సరితూగే సమఉజ్జీ రేవంత్ రెడ్డేనని అందరికీ అర్థమైంది. కామారెడ్డిలో ఓడిపోయినప్పటికీ కేసీఆర్ పై పోటీచేయడంద్వారా తాను గట్స్ ఉన్న లీడర్ అని, ఆషామాషీ లీడర్ కాదని రేవంత్ రెడ్డి నిరూపించుకున్నారు. మొత్తంగా రేవంత్ రెడ్డి కష్టం ఫలించింది.**



# బ్లాక్ చేయండి

**ఏ వంటింట్లో చూసినా.. నల్లరంగు వంట సామాన్లు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా గరిటెలు, వడ్డించే ఉపకరణాలన్నీ 'బ్లాక్ ప్లాస్టిక్'తో చేసినవే కనిపిస్తున్నాయి. అమెరికా, నెదర్లాండ్స్‌లోని పరిశోధకులు.. 'బ్లాక్ ప్లాస్టిక్' వంట సామాగ్రిపై ఇటీవల ఓ సర్వే నిర్వహించారు. ఆ వివరాలను 'కెమోస్పియర్ జర్నల్' ప్రచురించింది.**

సర్వేలో భాగంగా 200 కన్నా ఎక్కువ బ్లాక్ ప్లాస్టిక్ ఉత్పత్తులను పరీక్షించారు. వీటిలో సుషీ ట్రేలు, గరిటెలు, టేక్అవుట్ కంటైనర్‌లతోపాటు పిల్లలు ఆడుకునే బొమ్మలు, పూసల నెక్లెస్‌లు వంటివీ ఉన్నాయి. అయితే, ఈ వస్తువులలో 85 శాతం బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్, ఆర్గానో ఫాస్ఫేట్ ఫ్లేమ్ రిటార్డెంట్స్ వంటి హానికరమైన రసాయనాలు ఉన్నట్లు పరిశోధకులు కనుగొన్నారు. ఈ విష రసాయనాలు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచడంతోపాటు హార్మోన్లను నియంత్రించే ఎండోక్రైన్ వ్యవస్థకు అంతరాయం కలిగిస్తాయని చెబుతున్నారు. ఈ సామగ్రిని ఎక్కువగా వినియోగించే వ్యక్తులు క్యాన్సర్ బారినపడే ప్రమాదం మూడురెట్లు అధికమని తేల్చారు. రీసైకిల్ చేసిన ప్లాస్టిక్ నుంచి తయారైన బొమ్మలు కూడా అంతే ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కిచెన్‌లో ఉపయోగించే నాన్‌స్టిక్‌తోపాటు బ్లాక్ ప్లాస్టిక్ వస్తువుల వల్ల ఒక మనిషి శరీరంలోకి సగటును 34,700 పీపీఎం విషరసాయనాలు చేరుతున్నట్లు పరిశోధకులు చెబుతున్నారు. వీటి కారణంగా క్యాన్సర్ ప్రమాదం, పునరుత్పత్తి సమస్యలు, నరాలకు సంబంధించిన వ్యాధులతోపాటు ఇతర హార్మోన్లపైనా తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటికి బదులుగా గాజు, స్టెయిన్‌లెస్ స్టీల్ లాంటి ప్రత్యామ్నాయాలను వాడుకోవాలని సూచిస్తున్నారు.



# వాకింగ్.. టైమింగ్!

**నడకను మించిన వ్యాయామం లేదు. నిత్యం కనీసం 8వేల అడుగులైనా వేస్తే.. ఆరోగ్యానికి ఎంతో మేలు. కానీ, ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లడం అందరికీ సాధ్యంకాదు. అలాంటివారు సాయంత్రపు నడకను ఎంచుకుంటారు. అయితే.. ఉదయపు వ్యాయామం మంచిదా? సాయంత్రం వాకింగ్ బెటరా? అన్న అనుమానం చాలామందిని తొలుస్తూ ఉంటుంది. అందుకే, ఏ సమయంలో నడక సాగిస్తే ఆరోగ్యానికి ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయో తెలుసుకుందాం.**

### మార్నింగ్ వాక్‌తో..

తెల్లవారుజామున నడక.. శారీరక, మానసిక ప్రయోజనాలను అందిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పార్కుల్లో, ప్రశాంతమైన వాతావరణంలో వాకింగ్ చేయడం.. మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తుంది. ఉదయాన్నే శరీరానికి స్వచ్ఛమైన ఆక్సిజన్ అందితే.. రోజంతా హుషారుగా గడుస్తుంది. మనసు ప్రశాంతంగా ఉండి.. మనిషిలో సృజనాత్మకత పెరుగుతుంది. అది.. పనిపై అనుకూల ప్రభావం చూపుతుంది. జీవక్రియల రేటు పెరిగి.. బరువు కూడా తగ్గుతుంది. మార్నింగ్ వాక్ వల్ల శరీరంలోని కొవ్వు కరిగి.. శక్తిగా మారుతుంది.

### సాయంత్రం నడకతో..

**రోజంతా పనిచేసి అలసిపోయిన వారు.. సాయంత్రపు నడకతో రిలాక్స్ అవుతారు. పని ఒత్తిడి నుంచి ఉపశమనం లభిస్తుంది. గాఢమైన నిద్ర పడుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి సాయంత్రం నడక మంచి ఫలితాలను అందిస్తుంది. రాత్రి భోజనం తర్వాత ఓ 10 – 15 నిమిషాలు నడిస్తే.. జీర్ణ సమస్యలు కూడా దూరం అవుతాయి.**

### ఏది బెస్ట్ టైమ్?

నిజానికి ఉదయం నడిచినా.. సాయంత్రం నడిచినా ఆరోగ్యానికి మేలే! కాబట్టి.. మీకు అనువుగా ఉన్న సమయాన్నే వాకింగ్ కోసం ఎంచుకోండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి.

మహా పత్రిక
తెలుగు
శుక్రవారం, హైదరాబాద్ | 08-11-2024
జిల్లాల వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM


# కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ రాజకీయాలకు కాలం చెల్లినట్లే

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



**ఇల్లందు, నవంబర్ 7, మహా:** కాంగ్రెస్ పార్టీ డైవర్షన్ రాజకీయాలకు కాలం చెల్లినట్లేనని మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. గురువారం స్థానిక సుభాష్ నగర్ పంచాయతీలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే దిశగా పార్టీ కేడర్ పని చేయాలని కోరారు. సోషల్ మీడియా వారియర్స్ పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ కేడర్ పై అత్యుత్సాహం చూపిస్తున్న అధికారుల తీరును తాము తమ పింక్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నోట్ చేస్తూనే ఉన్నామని, అధికారంలోకి వచ్చాక ఖచ్చితంగా తిరిగి వారిది వారికి అప్పజెప్పుతామంటూ ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఒక దొంగకి ఏ విధంగా అయితే 420 అనే నెంబర్ బిరుదుగా ఉంటుందో అదేవిధంగా దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా ఆ విధంగానే ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని కాంతారావు ఆరోపించారు. దీపావళికి పేలుతాయన్న టపాకాయలు తుస్సుమన్నాయని, కాంగ్రెస్ పార్టీ పాలనలాగే పేలగా మారిపోయాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో గద్దెనెక్కడమే కాకుండా పార్టీలోకి చేర్చుకున్న పదిమంది ఎమ్మెల్యేలు ఉన్నచోట ఉప ఎన్నికలు వస్తే ఇప్పటికిప్పుడు గులాబీ పార్టీ జెండా ఎగరటం ఖాయమని రేగా ధీమా వ్యక్తం చేశారు. 6 గ్యారెంటీలను అమలు చేసేంతవరకు కాంగ్రెస్ శ్రేణులను గ్రామాల్లో తిరగనివ్వొద్దని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నాయక్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, 11వ వార్డు కౌన్సిలర్ జేకే శ్రీనివాస్, నాయకులు లక్కినేని సురేందర్, సిలివేరు సత్యనారాయణ, లకావత్ దేవిలాల్ నాయక్, దాస్యం ప్రమోద్ కుమార్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, ఘాజి, వల్లాల మంగమ్మ, పూనం కమల, యలమద్ది రవి, అజ్మీరా బావు సింగ్ నాయక్, తాండ్ర నాగరాజు, భూక్యా సురేష్, చిన్నారి, హుస్సేన్, నారాయణ, రవి, బానోతు రమేష్, ఈసం రమేష్, లస్కర్, కాంతారావు, నిట్ట భాస్కరరావు, బొమ్మెర వరప్రసాద్, బోడ బాలు, చీమల సత్యనారాయణ, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్, సాతల హరికృష్ణ, కాసాని హరిప్రసాద్ యాదవ్, నెమలి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# స్ఫూర్తి నింపుతున్న పెన్సిల్ ఆర్ట్ పెయింటింగ్



**సత్తుపల్లి, నవంబర్ 7, మహా:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 54వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో గురువారం ఆర్ట్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ చిత్రకారిణి నిర్మల సాయిశ్రీ ఆధ్వర్యంలో 54 చిత్రాలను ప్రదర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చిత్రాల ద్వారా ప్రదర్శనలో పెట్టి విద్యార్థులకు వివరించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రైతు బంధు, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పెన్షన్లు, విద్య అభివృద్ధి, గీత కార్మికులు, గొర్రెల కాపరులు, మత్స్య కారులకు చేయూతకు సంబంధించిన చిత్రాలను ఆర్ట్ ఎగ్జిబిషన్లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆశా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం నేర్చుకోవడం వలన ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, మనశ్శాంతి వంటి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. వీటితోపాటు ఏకాగ్రత, ఏ పని చేసినా పట్టుదలతో చేయాలనే మనోధైర్యం మీ సొంతమవుతుందంటూ ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం చిత్రకారిణి నిర్మల సాయిశ్రీ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ముఖచిత్రంతో కూడిన ప్రభుత్వ పథకాల చిత్రాలను గీయడానికి తనకు మూడు నెలల సమయం పట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరుకుళ్ళ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్



**ఖమ్మం , నవంబరు 7, మహా:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఈ నామ్ పేరుతో జెండా పాట లేకుండా పత్తి కొనుగోలుతో రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. అదేవిధంగా సీసీఐ తేమ శాతం నిబంధనలు సడలించి రైతులు దగ్గర పత్తి కొనుగోలు వేగవంతం చేయాలని కూడా డిమాండ్ చేసింది. గురువారం పత్తి మార్కెట్ ను రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబుతోపాటు పలువురు సందర్శించి కొనుగోలు తీరును పరిశీలించారు. అనంతరం రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆ తరువాత వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద రైతులతోపాటు వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన అరకొర మద్దతు ధర క్వింటాల్ కు రూ. 7521 కూడా లభించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 6700 నుంచి 5000 లోపు పత్తి కొనుగోలు ధర మాత్రమే పలుకుతుందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తేమ శాతం నిబంధనలు పత్తి రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నాయన్నారు. తేమ శాతం నిబంధనలను సడలించి, పత్తి కొనుగోలును వేగవంతం చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ సీజన్ లో అధిక వర్షాలు తెగుళ్లు మూలంగా పత్తి దిగుబడి సగానికంటే తగ్గిపోయిందని, అరకొరగా పండిన పత్తి అమ్మకంలో రైతులు నష్టపోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి రైతులకు మద్దతు ధర అందించేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై విక్రమ్, జిల్లా కమిటీ సభ్యులు, ఎర్రా శ్రీనివాసరావు, తాళ్ళపల్లి కృష్ణ, శీలం నరసింహారావు, ఖమ్మం త్రీటౌన్ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా నాయకులు వాసిరెడ్డి ప్రసాద్ ఎస్ కె మీరా, సుదర్శన్ రెడ్డి, బండారు యాకయ్య, హిమంతోపాటు పాల్గొన్నారు.



# ఆదర్శంగా నిలిచిన మృతుడి స్నేహితులు

## స్నేహితుని జయంతి రోజు రక్తదాన శిబిరం

**ఇల్లందు, నవంబర్ 7, మహా:** తమ చిన్ననాటి స్నేహితుడైన మేకల రాజు జయంతిని పురస్కరించుకొని గురువారం అతని స్నేహితులు, 13వ వార్డు యువత పట్టణంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో తల సేమియా వ్యాధిగ్రస్తుల కోసం టీఎస్సీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గత ఏడాది రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తమ స్నేహితుడు మేకల రాజును స్మరించుకుంటూ భారీ కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మేకల రాజు తమ వద్ద లేకున్నా తమ మదిలో చిరస్థాయిగా నిలిచిపోయాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు స్నేహితులతోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం పట్ల వారిని పలువురు అభినందించారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ



**ఇల్లందు, నవంబర్ 7, మహా:** ఇల్లందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా రిజిస్ట్రార్ రవీందర్ రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఫైల్స్ ను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా ఇల్లందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసినట్లు రవీందర్ రావు చెప్పారు. 1/70 చట్టం వల్ల ఇల్లందులో ఎక్కువగా రిజిస్ట్రేషన్ కావడంలేదన్నారు. రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. గత సంవత్సరంలో ఇల్లందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ద్వారా రూ. 2.17 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 76 జీవో ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని, అందరికీ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇల్లందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పక్కా భవనం లేదని, ప్రత్యామ్నాయంగా వేరే భవనం కోసం చూస్తున్నట్లు చెప్పారు. అనువైన భవనం దొరికితే వెంటనే కార్యాలయాన్ని మార్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు సబ్ రిజిస్ట్రార్ హేమలత, సిబ్బంది శైలజ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

## జిల్లా మత్స్య శాఖ అధికారి అవినాష్



**ఏటూరునాగారం, నవంబర్ 7, మహా:** ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లల ద్వారా మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని గిరిజన మత్స్యకారుల జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన సురేందర్ అన్నారు. గురువారం జిల్లాలోని తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో 11 లక్షల 2 వేల 5 వందల ఉచిత చేప పిల్లలను వదిలారు. కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీలో 3 రకాల చేప పిల్లలు.. 1. కట్ల 4,41,000 చేప పిల్లలు, 2. రవ్వ 5,51,250 చేప పిల్లలు, 3. మెరిగే 1,10,250 చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం రాయితీతో కూడిన ఉచిత చేప పిల్లలను మత్స్యకారులకు అందజేస్తుందని, దీని ద్వారా వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను అందజేయడం వల్ల మత్స్యకారుల ఎదుగుదలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరం సూర్యనారాయణ, పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, జిల్లా మత్స్య క్షేత్ర అధికారి రమేష్, తుపాకులగూడెం మత్స్య సంఘం అధ్యక్షులు ఆలం భాస్కర్, కార్యదర్శి కోరం సమ్మయ్య, చంద్రరావు, పీర్ల కేశవరావు, శ్రీనివాసరావు, నాగేశ్వర్రావు, ఆలం రాంబాబు, బక్కయ్య, చర్ప రవీందర్, ఆలం శ్రీను, కొమరం రామారావు, మత్స్య శాఖ సిబ్బంది క్రిష్ణ, మౌనిక, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతల ఆర్థిక సాయం



**ఏటూరునాగారం, నవంబర్ 7, మహా:** ఏటురునాగారం కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు తమ ఉదారాన్ని చాటుకున్నారు. మండలంలోని నందమూరి నగర్ కు చెందిన కావిరి బాబు ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో మండల కాంగ్రెస్ నేతలు గురువారం బాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి దశదిన కర్మ కార్యక్రమానికి 50 కేజీల రైస్ మరియు రూ.3000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎండీ అయూబ్ ఖాన్, మాజీ జడ్పీటీసీ ఎన్కేసీ గాంధీ, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్ మెన్ రాష్ట్ర కార్యదర్శి చింతకింది రాజు, కందుకూరి రతన్, శివాలయం డైరెక్టర్ దుర్గం కొమురయ్య, ఉమ్మనేని రమేష్, సునార్కని నాగరాజు, జిమిడి కళ్యాణ్, గంపల శివ, మాదరి రాంబాబు, ఎండీ ముజామిల్, గోగు మల్లయ్య, జనగం చెన్నేశ్వర్ రావు, కొండగొర్ల రాంబాబు, కొండాయి రమేష్, జనగాం సమ్మయ్య, దుర్గం దుర్గారావు, బొగ్గం సమ్మయ్య, కొండాయి బన్నీ, కొండాయి పాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్పీఎమ్‌తో రైతులకు మేలు

## జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ములుగు, నవంబర్ 7, మహా:** ప్రతి హార్వెస్టర్ వరి కోత సమయంలో 1820 ఆర్పీఎమ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. గురువారం కలెక్టరేట్ రేట్ లో సమావేశం నిర్వహించారు. 202425 ఖరీఫ్‌లో పంట కోతలో పాల్గొన్న హార్వెస్టర్ యజమానులతో జిల్లా ఎస్పీ షభరిష్, అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్ లతో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి హార్వెస్టర్ వరి కోత సమయంలో 1820 ఆర్పీఎమ్ నిర్వహించాలని సూచించారు. తద్వారా మంచి వరి వస్తుందని, తాలూ, పండని ధాన్యం కూడా తొలగించబడుతుందని పేర్కొన్నారు. హార్వెస్టర్ ఈ విధానాన్ని అనుసరిస్తే రైతులు వరి సగటు నాణ్యత కోసం మళ్లీ వరిని శుభ్రం చేయాల్సిన అవసరం ఉండబోదన్నారు. దీంతో రైతులకు ఖర్చులు తగ్గుతాయన్నారు. అన్ని మండల వ్యవసాయ అధికారులు హార్వెస్టర్ యజమానులతో మండల స్థాయిలో సమావేశం నిర్వహించి స్పష్టమైన సూచనలు ఇవ్వాలని, రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుంది? ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ పనిచేస్తుందా?, గన్నీ సంచులు అందాయా?, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయా?, ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా కూడా ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు అయిన రైతుల అకౌంట్లో సకాలంలో డబ్బులు జమ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులను కూడా రైతులకు ప్రతిరోజు అధికారులు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో ఎన్. వెంకటేష్, డీసీఎస్ఓ షా ఫైజల్ హుస్సేని, డీఎండీసీఎస్ఓ రాంపతి, జిల్లా సహకార అధికారి సర్దార్ సింగ్, ప్రతాప్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, తహశీల్దార్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులు, డిప్యూటీ తహశీల్దార్ నితీష్, హార్వెస్టర్ యజమానులతోపాటు పాల్గొన్నారు.

# నూతన ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక క్యాంపులు

## జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దివాకర

**ములుగు, నవంబర్ 7 మహా:**
జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దివాకర టీఎస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ 2025 కార్యక్రమాన్ని ఎన్నికల కమిషన్ చేపట్టిందని, ఈ నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో అక్టోబర్ 29, 2024న జారీ చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై ఆక్షేపణలు, అభ్యంతరాల స్వీకరణ, నవంబర్ 9, 10 తేదీలలో ప్రత్యేక క్యాంపేయిన్ డేలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ములుగు నియోజకవర్గానికి చెందిన ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు చెప్పారు. ముసాయిదాను పరిశీలించి జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేసుకోనున్నట్లు తెలిపారు. జాబితాలో తప్పుఒప్పుల సవరణ, పేర్లపై ఆక్షేపణలు, అభ్యంతరాలను తెలపడానికి 29 అక్టోబర్ 2024 నుండి 28 నవంబర్ 2024 వరకు గడువు విధించినట్లు, ఇందుకొరకు నవంబర్ 9, 10 తేదీలలో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక క్యాంపేయిన్ డేలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. స్పెషల్ క్యాంపేయిన్ లను నిర్వహించడానికి సంబంధిత బూత్ స్థాయి అధికారులు వారి వారి పోలింగ్ కేంద్రాలలో ఉదయం 10 గంటలలోగా హాజరు కావాలని ఆదేశించారు.
క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తిచేసి లాజికల్ ఎర్రర్స్ లేకుండా చూడాలని, పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండే ట్రాన్స్ జెండర్స్, వికలాంగులు ఓటర్లుగా నమోదయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు, జర్నలిస్టులు, జ్యుడీషరీ, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన వ్యక్తుల వివరాలను ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్ఓ సూపర్ వైజర్లు పరిశీలించి ధృవీకరించి, ఆ ధృవీకరణను సమర్పించాలన్నారు. ఈఆర్ఓ లు కనీసం 10 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వివరాలను దృవీకరించుకోని జిల్లా ఎన్నికల అధికారిని దృవీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రం పరిదిలోని విఐపిల వివరాలు జాబితా నుండి తొలగిపోకుండా సరిచూసుకొని ఈఆర్ఓ లు నిర్ధారించుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# సాయిస్ఫూర్తి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు



**సత్తుపల్లి, నవంబర్ 7, మహా:** మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులకు గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్పైడర్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) డ్రైవ్ లో భాగంగా బెంగళూరు వారిచే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ డ్రైవ్ కు 183 మంది విద్యార్థులు హాజరు కాగా, వీరికి గ్రూప్ డిస్కర్షన్, టెక్నికల్ రౌండ్, హెచ్ ఆర్ ఇంటర్వ్యూలు ద్వారా 28 మందిని సెలెక్ట్ చేశామని, కంపెనీ హెచ్ఆర్ మేనేజర్ లు తెలియజేశారు. వారికి వార్షిక వేతనం రూ. 3.6 5.5 లక్షల వరకు ఉంటుందన్నారు. వీరిని సాఫ్ట్ వేర్ డెవలపర్ గా వివిధ కేటగిరీలలో ఉద్యోగ అవకాశం కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు తమ కోర్సు కంప్లీట్ అయిన తరువాత ఉద్యోగాలలో జాయిన్ అవ్వవచ్చు అని, వారికి 15 రోజులపాటు ట్రైనింగ్ ఇస్తామని కంపెనీ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరు శేషారత్నకుమారి మాట్లాడుతూ క్యాంపస్ రిక్రూట్మెంట్ లో యువత ముందుండాలని, ఇంకా ముందు ముందు ఎన్నో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థినీవిద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే నిర్దిష్టమైన లక్ష్యంతో ఉన్నతమైన విలువలు కలిగిన సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ ఇప్పటికే ప్రారంభించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఈరోజు తమ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ లు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ విధంగా క్యాంపస్ రిక్రూట్మెంట్ లో ఉపాధి అవకాశాలు పొందిన విద్యార్థులను హీరో సంస్థ అధినేత, రాజ్యసభ సభ్యులు సాయిస్ఫూర్తి మేనేజింగ్ డైరెక్టర్ బండి పార్థసారథి రెడ్డి, ఉపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బండి అన్విధ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

# బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుంది



## కాకులమర్రి లక్ష్మణ్ బాబు

**ఏటూరునాగారం, నవంబర్ 7(మహా):** ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మల్లెల మూర్తి అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమారి లక్ష్మణ్ బాబు గురువారం మూర్తి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా ఇటీవల మరణించిన అట్టెం నాగరాజు కుటుంబ సభ్యులకు ఆయన భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని ధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ బాబు, తాదూరి రఘు, తాటి కృష్ణ, ఎండి ఖాజా పాషా, మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, సప్పిడి రామ్ నరసయ్య, మాదరి రామయ్య, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, కాళ్ల రామకృష్ణ, గండేపెల్లి నర్సయ్య, కాకులమర్రి భాస్కరరావు, ఖలీల్, ముస్తఫా, కొండాయి గ్రామ కమిటీ అధ్యక్షులు, పాయం రాకేష్, మందపల్లి సాగర్, పడదల మహేందర్, లక్ష్మణ్. నర్సింగరావు, నాగరాజు, రాంబాబు నానాజీతోపాటు బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సృష్టి ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుంది: పువ్వాడ




**ఖమ్మం , నవంబర్ 7, మహా:** ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిజానికి ప్రత్యామ్నాయంలేదని కరుడుకట్టిన పెట్టుబడిదారి దేశాలు సైతం సంక్లిష్ట స్థితిలో మార్క్ ఆలోచనలను పరిగణలోకి తీసుకుంటున్నాయని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు శక్తులు పురోగమించడం పలు దేశాలలో ప్రజాస్వామ్య పద్ధతులలో సైతం అధికారంలోకి రావడం దీనికి సంకేతమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందో సంవత్సరంలోకి అడుగిడుతున్నసందర్భంగా గురువారం గిరిప్రసాద్ భవన్ లో పార్టీ సభ్యత్వ, పునరుద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో పువ్వాడ మాట్లాడుతూ కమ్యూనిజానికి మరణం లేదన్నారు. సృష్టి ఉన్నంతకాలం, దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. ఆటుపోట్లు, నిర్బంధాలు జయఅపజయాలు కమ్యూనిస్టు పార్టీకి కొత్తకాదన్నారు. ఇబ్బందికర పరిస్థితులలో సైతం పురోగమించిన అపూర్వ ఘట్టాలు వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమంలో అనేకమున్నాయని పువ్వాడ స్పష్టం చేశారు. పెట్టుబడిదారి, కార్పొరేట్ శక్తులు కమ్యూనిస్టు భావజాలాన్ని, కమ్యూనిస్టుల ఉనికిని నియంత్రించడానికి ప్రయత్నిస్తుంటాయన్నారు. మారిన రాజకీయ పరిస్థితులలో రాష్ట్ర వ్యాప్తంగా లక్ష కుటుంబాలు కమ్యూనిస్టు పార్టీ నీడ ఉండటం అభినందనీయమన్నారు. ఈ కుటుంబాల సంఖ్యను శత సంవత్సరాల వేళ మరింతగా పెంచాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలు ఎజెండాగా పార్టీ ఉద్యమాలను పోరాటాలను నిర్వహించాలన్నారు. పార్టీ వందో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా సభ్యులుగా చేరుతున్న ప్రతి ఒక్కరికీ పువ్వాడ శుభాభివందనాలు తెలిపారు. పార్టీ నేతలు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేంద్రరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నాగులవంచలో పర్యటించిన డిప్యూటీ సీఎం



**చింతకాని, నవంబర్ 7, మహా:** రూ. 8 కోట్ల 90 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. గురువారం ఆయన చింతకాని మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ. 5 కోట్ల 40 లక్షల నిధులతో చేపట్టిన నాగులవంచ తిర్లాపురం ఆర్అండ్ బీ రోడ్డు నుంచి చింతకాని వయా తుమ్మల చెరువు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, నాగులవంచ నుండి తిమ్మినేని పాలెం తిర్లాపురం క్రాస్ రోడ్డు వరకు రూ. 3 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు పనులకు నాగులవంచ వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి, అగ్రిమెంట్ సమయంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, అధికారులతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ పోస్ట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 7, మహా:** భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి పాయింట్ లోని చెక్ పోస్ట్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టులో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహించే సిబ్బంది నిత్యం అప్రమతంగా ఉండాలని, ఎటువంటి అక్రమ కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం వాహన తనిఖీలు చేయాలన్నారు. తనిఖీల సమయంలో ఏమి చేయాలో, చేయకూడదో సిబ్బందికి ఆయన స్పష్టంగా వివరించారు. రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది రేడియం జాకెట్స్ ధరించాలని, భద్రతా పరమైన చర్యలు తప్పకుండా తీసుకోవలని ఎస్పీ సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలలో భద్రాచలం టౌన్ సీఐ సంజీవ రావు, టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# పీహెచ్ సీలో మందుల పట్టిక కంపల్సరీ: జిల్లా వైద్యాధికారి

**ఖమ్మం, నవంబర్ 7, మహా:** జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల పట్టిక, సిటిజన్ చార్ట్, స్టాఫ్ వివరాలు ప్రదర్శించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. కళావతి బాయి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని ప్రేరణ సమావేశ మందిరంలో సూపర్వైజర్లు, ఫార్మాసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో అందించే సేవలను హెచ్ఎంఐఎస్ పోర్టల్ నందు నమోదు చేసి లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రణాళిక, కోల్డ్ చైన్ నిర్వహణ, వ్యాక్సిన్ పంపిణీ, ఏఐఎఫ్ఐ పై అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. ప్రతి గర్భిణీ, చిన్నారిని గుర్తించి సరైన సమయంలో సక్రమంగా టీకాలు అందించి, ప్రతి లబ్ధిదారు వివరాలను యువిన్ పోర్టల్ నందు నమోదు చేయాలని, వ్యాక్సిన్ వివరాలను కూడా తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. జిల్లాలో అన్ని వైద్య ఆరోగ్య కార్యక్రమాలు అమలు తీరు మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. వ్యాధులను అరికట్టేందుకు పరీక్షలు, చికిత్సలు మెరుగుగా చేయాలని, మందుల పంపిణీ విధానంలో లోపం లేకుండా లబ్ధిదారులకు అందించాలని, ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో అప్ డేట్ చేయాలని ఆమె ఆదేశించారు.



# ఇల్లందులో ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభ

**ఇల్లందు, నవంబర్ 7, మహా:** టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెంలో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు, దళిత రత్న మేకల శ్యామ్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, సిరినోల్ల బాలరాజు మాదిగ, గుండా రమేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాదిగ, మాదిగ ఉపకులాల నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావడం సంతోషకరమన్నారు. అదేవిధంగా ఈ సభ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# కులగణన సర్వేకు యాదవులు సహకరించాలి

**అఖిల భారత యాదవ మహాసభ**




**ఖమ్మం సిటీ, నవంబర్ 7, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని, ముఖ్యంగా బీసీల స్థితిగతులు, జనాభా వివరాలు పూర్తిగా తెలియడం ద్వారా రాజ్యాంగం నుంచి సంక్రమించే హక్కులు అధిక జనాభా కలిగిన బీసీలకు వచ్చే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అధికారులకు సహకరించవలసిందిగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 ఆగస్టులో చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే ద్వారా బీసీల శాతం 61% ఉన్నట్లుగా తేలిందని, కానీ దానిని గత ప్రభుత్వం ఆ వివరాలను బయటపెట్టకుండా బీసీలకు అన్యాయం చేసిందన్నారు. బీసీల జనాభా ఎక్కువ ఉన్నదని తెలిస్తే హక్కుల కోసం పోరాటం చేస్తారని, ఈ ఉద్దేశంతోనే గత రాష్ట్ర ప్రబుత్వం వెనుకబడిన వర్గాలకు అన్యాయం చేసిందని వారు ఆరోపించారు. గత పాలకుల మాదిరిగా కాకుండా ఈసారి చేపట్టే ఈ కార్యక్రమం నిష్పక్షపాతంగా ఉండాలని, సర్వే వివరాలను వెంటనే అధికారికంగా ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్వే ఆధారంగా బీసీలకు రాజ్యాంగ అధికారం కలిగించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకంగా యాదవులు సర్వే ఫారం కులం (7)లో యాదవ్ అని వ్రాయించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్ఎస్ టీ (సంచార జాతులు) సర్టిఫికెట్ ను యాదవులకు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ నాయకులు పొదిల సతీష్, సత్తి వెంకన్నయాదవ్, వాగదాని కోటేశ్వర రావు, పొదిలి భూపతి, కంకు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో బోధనేతర సిబ్బంది

**కొరకు దరఖాస్తుల ఆహ్వానం!**

**టేకులపల్లి, నవంబర్7, మహా:** టేకులపల్లి కస్తూర్బా పాఠశాలలో బోధనేతర సిబ్బంది కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ. జగన్ తెలిపారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టేకులపల్లి మండల కేంద్రంలో ఉన్న కేజీబీవీలో 2024 25 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంట్రాక్టు ప్రాతిపదికన బోధనేతర సిబ్బంది.. డే వాచ్ మెన్, అటెండర్ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిసున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి టేకులపల్లి మండల విద్యాధికారి కార్యాలయం ఎంఆర్పీ నందు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ఉ.10 గంటల నుంచి సా. 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడుతాయని సదరు అధికారి పేర్కొన్నారు. దరఖాస్తుకు ఎస్సెస్సీ మెమో, బయోడేటా, క్యాస్ట్, ఆధార్, రెసిడెన్సియల్ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలపై గెజిటెడ్ సిగ్నేచర్ తప్పనిసరిగా జతపర్చాలని ఆయన అభ్యర్థులకు సూచించారు.

## 108 అంబులెన్స్‌లో ప్రసవించిన గర్భిణీ



**తల్లి,బిడ్డ క్షేమం..**
**108 సిబ్బందికి అభినందనలు**

**పాలేరు, నవంబర్ 7, మహా:** ఓ నిండు గర్భిణీ 108 వాహనంలో ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. 108 వాహనంలో ప్రసవానికి సహకరించి ప్రాథమిక వైద్యసేవలందించిన 108 సిబ్బందిని కుటుంబం సభ్యులు, ప్రజలు అభినందించారు. ఈ సంఘటన తిరుమలాయపాలెం మండలంలో గురువారం చోటు చేసుకుంది. 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ అంబాల రాణి తెలిపిన వివరాల ప్రకారం తిరుమలాయపాలెం మండలం జల్లెపల్లి గ్రామానికి చెందిన పందిరి దివ్య అనే గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 కు కాల్ చేశారు. తక్షణమే స్పందించిన 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గర్భిణీని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించసాగారు. అయితే మార్గమధ్యలో ఆమెకు పురిటినొప్పులు రావడంతో పైలెట్ లింగయ్యతో కలిసి ప్రాథమిక వైద్యసేవలందించినట్లు రాణి తెలిపారు. ఈ క్రమంలో 108 వాహనంలోనే ఆమె ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ శిశువు 2.5 కేజీలు ఉన్నట్లు, ప్రస్తుతం తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నారని రాణి పేర్కొన్నారు. అనంతరం వారిని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా, ప్రాథమిక వైద్యసేవలందించిన 108 సిబ్బందిని కొనియాడుతూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రశంసించారు.

# సర్వే విధులు తప్పనిసరి

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ఖమ్మం, నవంబర్ 7, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఆయన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే నిర్వాహణకు నిర్దేశించిన ఫార్మాట్ లో ఫారంలు, సర్వే సిబ్బందికి అవసరమైన పరికరాలు, స్టేషనరీ ఐటెమ్స్ పంపిణీ మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 8 నుంచి ఖమ్మం జిల్లాలో ఇంటింటికి తిరుగుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించాలన్నారు. ఖమ్మం నియోజకవర్గానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, ఖమ్మం కార్పొరేషన్ కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి అదనపు డీఆర్డీవో నూరొద్దీన్, వైరా నియోజకవర్గానికి ఖమ్మం డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, మధిర నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్ అధికారి ఖమ్మం నర్సింహారావు, సత్తుపల్లి నియోజకవర్గానికి ఆర్డీఓ కల్లూరు రాజేందర్ లు ఇంచార్జీలుగా ఉంటారని పేర్కొన్నారు. సర్వే ప్రాముఖ్యతను క్షేత్రస్థాయి సిబ్బందికి తెలియజేయాలన్నారు. అసెంబ్లీ ఇంచార్జీ అధికారులు ఏదైనా శాఖ నుంచి సరైన స్పందన లేకపోతే సమాచారం అందిస్తారని, వెంటనే పనితీరు మెరుగుపర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్యుమరేటర్లు పూర్తి స్థాయిలో బాధ్యతలను స్వీకరించి సర్వే పనులు ప్రారంభించేలా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. నియమించిన ఎన్యుమరేటర్లు వెంటనే రిపోర్టు చేసేలా చూడాలన్నారు.

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

ఇదిలా ఉంటే.. సర్వేకు రిపోర్ట్ చేయని ఎన్యుమరేటర్లకు గల కారణాలను సంబంధిత శాఖ అధిపతుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సర్వే విధులు తప్పనిసరి అని, ఇది వాలంటరీ పని కాదని తప్పనిసరిగా చేయాల్సిన బాధ్యతని, సర్వే విధుల్లో నిర్లక్ష్యంగా వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ సర్వే నిర్వహణకు ప్రాథమికంగా అవసరమైన సామాగ్రి, ప్రశ్నావళి ఫార్మాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సర్వే నిర్వహణకు నియమించిన ఎన్యుమరేటర్లు విధులకు హాజరయ్యే విధంగా సంబంధిత శాఖాధిపతులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కళావతి బాయి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖరశర్మ, అధికారులతోపాటు తదితరులు పాల్గొన్నారు.



# ద్వీపాల లక్నవరం

- 5 స్విమ్మింగ్ పూల్స్.. 20 కాటేజీలతో మాల్దీవ్స్
- సుందరీకరణ చేసిన పర్యాటకశాఖ
- త్వరలోనే అధికారికంగా ప్రారంభం

**ములుగు, నవంబర్ 7, మహా:** చుట్టూర కొండలు.. నడుమ జలాశయం.. మధ్యలో ఎత్తైన ద్వీపాలతో ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసే పర్యాటకుల వరం లక్నవరం ఇప్పుడు మరింత శోభను సంతరించుకున్నది. గతంలో రెండు వేలాడే వంతెనలతో ఒక ఐలాండ్ ను పర్యాటకులకు అందించగా రెండవ ఐలాండ్ లో రెసార్ట్ ను పర్యాటకశాఖ నడిపిస్తుంది. ప్రస్తుతం మూడవ ఐలాండ్ ను పర్యాటకశాఖ, మరో ప్రైవేటు సంస్థ సంయుక్తంగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ది కోవ్ బై ఫ్రీక్ ఔట్స్ పేరిట ఈ ఐలాండ్ నిర్వహిస్తున్నారు. ఈ ఐలాండ్ లో అభివృద్ధితో ఇప్పటికే పర్యాటక జిల్లాగా పేరొందిన ములుగు జిల్లాలోని ఈ సరస్సుకు పర్యాటకుల తాకిడి పెరుగనుంది.

**5 స్విమ్మింగ్ పూల్స్.. 22 కాటేజీలు**

పచ్చని కొండలను కలుపుతూ నీటిపై వేలాడే వంతెనలు, బోటింగ్, సేద తీరడానికి ఐలాండ్ లోనే రిసార్ట్ లతో ప్రకృతి ప్రేమికులకు సౌకర్యాలు కల్పిస్తున్న పర్యాటకశాఖ మూడవ ఐలాండ్ లో 5 స్విమ్మింగ్ పూల్స్, 22 కాటేజీలను ఏర్పాటు చేసింది. కుటుంబ సమేతంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపేందుకు చక్కటి పార్కును ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. పిల్లల కోసం ప్రత్యేకంగా స్విమ్మింగ్ పూల్ ను నిర్మించారు. అందులో ఆడుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రపంచ పర్యాటక ప్రాంతాలతో పోటీ పడేవిధంగా మాల్దీవ్ లను తలపించేలా ఐలాండ్ ను తీర్చిదిద్దారు. నాలుగు స్విమ్మింగ్ పూల్స్ ను మాత్రం గదులను బుక్ చేసుకున్నవారికి ప్రత్యేకంగా కేటాయించగా, ఒకటి మాత్రం ఓపెన్ స్విమ్మింగ్ పూల్ ను ఏర్పాటు చేసినట్లు ఐలాండ్ మేనేజర్ జితేందర్ రావు తెలిపారు. అదేవిధంగా 20 కాటేజీలలో పర్యాటకులు కుటుంబ సభ్యులతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు అన్ని వసతులు కల్పించారు. అందులో నాలుగు మాత్రం ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. ఐలాండ్ లో మిగిలిన పనులను పూర్తి చేస్తున్న నిర్వాహకులు ఇప్పటికే పర్యాటకుల నుంచి తమ సోషల్ మీడియా ద్వారా బుకింగ్ కోసం ఉత్సాహం చూపుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 24న అనధికారికంగా ప్రైవేటు సంస్థ ప్రారంభించిన లక్నవరం మూడో ఐలాండ్ కు ప్రతిరోజూ బుకింగ్స్ భారీగా వస్తున్నాయి. రూ. 6 వేల నుంచి రూ.12 వేల వరకు ధరను నిర్ణయించినట్లు మేనేజర్ వెల్లడించారు. త్వరలోనే అఫీషియల్ వెబ్సైట్ ను కూడా లాంచ్ చేయనున్నామని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు చెకిన్ అయితే మరుసటి రోజు ఉదయం 11గంటలకు చెక్ఔట్ అవుతారని తెలిపారు.


**త్వరలో అధికారికంగా ప్రారంభిస్తాం**

**జితేందర్ రావు, లక్నవరం 3వ ఐలాండ్ మేనేజర్**

**లక్నవరం సరస్సులో టూరిజం శాఖ అనుమతులతో ఫ్రీక్ ఔట్ సంస్థ ఆధ్వర్యంలో ఐలాండ్ నిర్మాణం జరిగిందని, త్వరలో అధికారికంగా ఈ ఐలాండ్ ను ప్రారంభిస్తాం. ఇప్పటికే తమ ఇన్ స్టా, ఇతర సోషల్ మీడియా ద్వారా బుకింగ్స్ కొనసాగుతున్నాయి. ఇక్కడికి వచ్చేందుకు పర్యాటకులు, ముఖ్యంగా యువత ఉత్సాహం చూపతుఉన్నారు. దీంతో కాటేజీలు ఖాళీగా ఉండడంలేదు. రూ.6 వేల నుంచి రూ.12 వేల వరకు ధర నిర్ణయించాం. త్వరలోనే అధికారిక వెబ్సైట్ లాంచ్ చేయడం ద్వారా పూర్తిస్థాయిలో బుకింగ్ అందుబాటులోకి వస్తుంది.**

# ఉద్యోగంలో చేరిన 22 రోజులకే విధుల నుంచి తొలగింపు

- అక్టోబర్ 16 న సిఎం చేతుల మీదుగా నియామాక పత్రం
- అర్హత లేదని అర్ధరాత్రి టర్మినేషన్
- కన్నీరు మున్నేరుగా వినిపిస్తున్న అభ్యర్థులు



**ఖమ్మం జిల్లా ప్రతినిధి, నవంబర్ 7, మహా:** సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రాలు పొందిన హిందీ పండిట్లపై ఖమ్మం విద్యాశాఖ అనర్హత వేటు వేసింది. ఖమ్మం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏడుగురు హిందీ పండిట్ల కు జీవో నెంబర్ 25 ప్రకారం అర్హత లేదంటూ జిల్లా విద్యాశాఖ వారిని ఉద్యోగం నుంచి తొలగించింది. 2024 డీఎస్సీ బ్యాచ్ కు చెందిన హిందీ పండిట్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెల 16వ తేదీన నియామక పత్రాలు అందజేశారు. విద్యాశాఖ వారికి ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆ ఉపాధ్యాయులు విధుల్లో చేరి 22 రోజులు అవుతున్న క్రమంలో ఒక్కసారిగా విద్యాశాఖ వారికి పిడుగు లాంటి వార్త వినిపించింది. విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లలో లోపాలు ఉన్నాయని, ఆ కారణంగా మెరిట్ అభ్యర్థులకు అన్యాయం జరగడమే కాకుండా, ఆయా పాఠశాలలో విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యాబోధన అందదని రుజువు చేస్తూ విద్యాశాఖ అధికారి సోమేశ్వర్ శర్మ నవంబర్ 6వ తేదీన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు ఆదేశాలు ఇచ్చారు. అయితే, డీఎస్సీ 2024 బ్యాచ్ కు చెందిన జిల్లాలోని 7 హిందీ పండిట్లు ఆయా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. మాయరి నాగేశ్వర్ రావు మధిర సీపీఎస్ పాఠశాలలో, సట్టు రామలింగయ్య బానిగండ్లపాడు పాఠశాలలో, షేక్ నాగుల్ మీరా వేంసూర్ మండలంలోని కందుకూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో, దోర్నాల లావణ్య మధిర మండలంలోని చిలుకూరు జెడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో, తాటికొండ నాగలక్ష్మీ కూసుమంచి మండల పరిధిలోని పాలేరు జెడ్పీహెచ్ ఎస్ పాఠశాలలో, తాటికొండ శ్రీదేవి ఎర్రుపాలెం మండలంలోని రేమిడిచర్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో, మొండేటి వెంకట రత్నం కొణిజర్ల మండలంలోని తుమ్మలపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒకసారిగా విద్యాశాఖ ఆ ఏడుగురు ఉపాధ్యాయులను అనర్హులుగా ప్రకటించడంతో వారు నిర్ఘాంతపోయారు. విద్యాశాఖ అధికారులు తీసుకున్న ఈ నిర్ణయం వల్ల తాము రోడ్డున పడ్డామని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గురువారం విద్యాశాఖ కార్యాలయానికి చేరుకుని జిల్లా విద్యాశాఖ అధికారి ముందు తమ గోడును వెలిబుచ్చారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారిని వివరణ కోరగా విధులలో నుంచి తొలగించిన అభ్యర్థులు అందజేసిన సర్టిఫికెట్ల విషయమై పలు లోపాలు ఉన్నాయని, ఈ విషయం బయటపడడంతోనే వారిని విధుల నుంచి టర్మినేషన్ చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్లలో లోపాలు ఉన్నాయని, దరఖాస్తు చేసుకునే సమయంలో అభ్యర్థులు జీవో నెంబర్ 25 ను పూర్తిగా తెలుసుకోలేకపోయారని వివరించారు. అభ్యర్థులకు అన్యాయం జరగటం తమకు కూడా బాధగానే ఉందన్నారు. అంతేకాకుండా వెరిఫికేషన్ అధికారులపై కూడా చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

# అయ్యయ్యో.. రూపాయే

## ఆల్‌టైమ్ కనిష్ఠానికి కరెన్సీ.. డాలర్ ముందు రుపీ వెలవెల

### 22 పైసలు పడిపోయి 84.31 వద్దకు పతనం

### ట్రంప్ విజయంతో అమెరికా డాలర్‌కు పెరిగిన డిమాండ్




**ముంబై, మహా:** రూపాయి విలువ భారీగా పతనమైంది. బుధవారం ఒక్కరోజే ఏకంగా 22 పైసలు క్షీణించింది. ఫలితంగా ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే దేశీయ కరెన్సీ మారకపు రేటు మునుపెన్నడూ లేనివిధంగా 84.31 స్థాయికి దిగజారింది. హోరాహోరీగా జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించడంతో యూఎస్ డాలర్ ఇండెక్స్ పరుగులు పెట్టింది. ఈ క్రమంలోనే రుపీ విలువ ఆల్‌టైమ్ లో స్థాయికి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో అన్ని ప్రధాన దేశాల కరెన్సీల విలువ ఒక్కసారిగా పెరగడం, మరోవైపు దేశీయ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసినట్టు ఫారెక్స్ ట్రేడర్లు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. త్వరలో జరుగబోయే ఫెడ్ రిజర్వ్ ద్రవ్యసమీక్షలో వడ్డీరేట్ల కోతలుంటాయన్న అంచనాలూ దెబ్బతీసినట్టు చెప్తున్నారు. 2025లో 100 బేసిస్ పాయింట్లదాకా వడ్డీరేట్ల తగ్గింపులుండొచ్చన్న అభిప్రాయాలున్నాయి.

**ఒడిదొడుకుల్లో..**

దాదాపుగా గత వారం రోజుల నుంచి ఊగిసలాటకు గురువుతున్న రూపాయి మారకం విలువ.. బుధవారం తీవ్ర ఒడిదొడుకులకు లోనైంది. ఉదయం ట్రేడింగ్ ఆరంభంలోనే 14 పైసల నష్టంతో 84.23 వద్ద మొదలవగా, చివరకు 22 పైసల నష్టంతో 84.31 స్థాయికి పడిపోయింది. మధ్యలో 84.15కు కోలుకున్నా నిలదొక్కుకోలేకపోయింది. సోమవారం ముగింపుతో చూస్తే మంగళవారం రుపీ 2 పైసలు బలపడి 84.09 వద్ద నిలిచింది. అయితే ఆ జోష్‌ను కొనసాగించలేకపోయింది. ట్రంప్ గెలుపుతో డాలర్ ఇండెక్స్ 1.34 శాతం ఎగిసి 104.80 వద్దకు చేరింది.

**ఆర్బీఐ జోక్యం అవసరం**

రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠానికి పతనమైన నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యం లాభించగలదన్న అభిప్రాయాలు ఫారెక్స్ మార్కెట్ నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఆర్బీఐ చర్యలు రుపీ విలువను తిరిగి పెంచగలవని అంటున్నారు. కాగా, గ్లోబల్ మార్కెట్లలో పెట్టుబడులకు రిస్క్ పెరగడం, కమోడిటీ ధరల్లో క్షీణత కూడా రూపాయిని బలపర్చగలదని పేర్కొంటున్నారు.

# రెండో రోజూ స్విగ్గీ ఐపీఓలో అంతంతే సబ్ స్క్రిప్షన్లు..




**మహా:** ఫుడ్ డెలివరీ అండ్ క్విక్ కామర్స్ మేజర్ 'స్విగ్గీ' ఐపీఓకు గురువారం రెండో రోజు కూడా 35 శాతం షేర్లకే సబ్ స్క్రిప్షన్లు వచ్చాయి. ఎన్ఎస్ఈ వెల్లడించిన డేటా ప్రకారం 16,09,703 షేర్లకు 5,56,98,652 షేర్లకు మాత్రమే బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ ఇన్వెస్టర్లు 84 శాతం బిడ్లు దాఖలు చేస్తే క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 28 శాతం బిడ్లు ఫైల్ చేశారు. ఇక నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు 14 శాతం సబ్ స్క్రిప్షన్లు చేశారు. మరోవైపు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.5,085 కోట్ల నిధులు సేకరించినట్లు మంగళవారం స్విగ్గీ వెల్లడించింది. బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న స్విగ్గీ ఐపీఓలో షేర్ విలువ రూ.371390గా ప్రతిపాదించింది. ఐపీఓ ద్వారా రూ.11,327 కోట్ల నిధులు సేకరించాలని తలపెట్టింది. అందులో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా రూ.6,828 కోట్లు, తాజాగా షేర్ల జారీ ద్వారా రూ.4,499 కోట్ల నిధులు సేకరించడం లక్ష్యంగా పెట్టుకున్నది. కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, జేపీ మోర్గాన్ ఇండియా, సిటీ గ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ ఇండియా, బీఓఎఫ్ఏ సెక్యూరిటీస్ ఇండియా, జెఫరీస్ ఇండియా, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ అవెండస్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు. .స్విగ్గీ ఐపీఓ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

# ట్రంప్ గెలుపు ఎఫెక్ట్..

## రూ.80 వేల దిగువన బంగారం..

## ఒక్కరోజే రూ.2,900 తగ్గిన వెండి..!



**మహా:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికవ్వడంతో బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పట్టాయి. మూడు రోజుల్లో రూ.3750 పతనమై రూ.79,500 మార్కుకు చేరుకున్నది. కిలో వెండి ధర రూ.6,950 వద్ద స్థిర పడింది. గురువారం దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారట్ల బంగారం తులం ధర రూ.1,650 పతనమై రూ.79,500 వద్దకు చేరుకుని రూ.80వేల దిగువకు పడిపోయింది. బుధవారం తులం బంగారం ధర (24 క్యారట్స్) రూ.81,150 వద్ద కొనసాగింది. మరోవైపు కిలో వెండి ధర రూ. 2,900 పతనమై రూ.93,800 వద్ద నిలిచింది. బుధవారం కిలో వెండి ధర రూ.96,700 వద్ద స్థిర పడింది. గురువారం 99.5 స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1650 క్షీణించి రూ.79,100 వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్లలోనూ సెంటిమెంట్ బలహీనంగా ఉండటంతో బంగారం ధర పడిపోయింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో తులం బంగారం డిసెంబర్ డెలివరీ గోల్డ్ కాంట్రాక్ట్స్ ధర ఫ్లాట్ గా రూ.76,655 వద్ద కొనసాగుతున్నది. కిలో వెండి డిసెంబర్ డెలివరీ సిల్వర్ కాంట్రాక్ట్స్ ధర రూ.90,811 వద్ద ముగిసింది. కీలక వడ్డీరేట్ల తగ్గింపు విషయమై గురువారం రాత్రి వెలువడనున్న యూఎస్ ఫెడ్ రిజర్వ్ నిర్ణయం కోసం ఇన్వెస్టర్లు ఎదురు చూస్తున్నారు. కామెక్స్ గోల్డ్ లో ఔన్స్ బంగారం ధర 1.90 డాలర్లు తగ్గి 2674 డాలర్లు పలికింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక నేపథ్యంలోనే బంగారం ధర తగ్గుతుందని భావిస్తున్నారు. ఔన్స్ వెండి ధర 0.24 శాతం తగ్గి 31.26 డాలర్లకు పడిపోయింది. జూలై తర్వాత తొలిసారి అమెరికా డాలర్ విలువ పెరిగింది.

# అందరి దృష్టి యూఎస్ ఫెడ్ పైనే..

## రెండు రోజుల లాభాలకు బ్రేక్..!



**మహా:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలతో రెండు రోజుల పాటు లాభాలు గడించిన దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. వడ్డీరేట్ల తగ్గింపుపై యూఎస్ ఫెడ్ రిజర్వ్ తీసుకునే నిర్ణయం మీద అందరూ దృష్టిని కేంద్రీకరించడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఫలితంగా బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 836.34 పాయింట్ల పతనంతో 79,541.79 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్ లో ఒకానొక దశలో 958.79 పాయింట్ల మేర నష్టపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 284.70 పాయింట్లు నష్టపోయి 24,199.35 పాయింట్ల వద్ద స్థిర పడింది.



## దేశం-విదేశం | NATIONAL NEWS



# ఆలయంలో చోరీ..

## రూ.78 లక్షల విలువైన బంగారు గొలుసులు దొంగిలించిన వ్యక్తి



**మహా, అహ్మదాబాద్:** పురాతన ఆలయంలో చోరీ జరిగింది. అమ్మవారికి చెందిన రూ.78 లక్షల విలువైన బంగారు నగలను ఒక వ్యక్తి దొంగిలించాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 28న పావగఢ్ కొండలపై ఉన్న పురాతన మహాకాళి దేవి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయం గర్భగుడిలోకి ప్రవేశించిన దొంగ రూ. 78 లక్షల విలువైన ఆరు బంగారు హారాలు, బంగారు పూతపూసిన రెండు వస్తువులు అపహరించాడు. కాగా, ఆలయ సిబ్బంది నుంచి ఫిర్యాదు అందుకున్న పోలీసులు ఈ చోరీపై స్పందించారు. గుడితో పాటు పరిసర ప్రాంతాల్లోని 150కుపైగా సీసీటీవీల ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగతనం ముందు రోజు ఒక వ్యక్తి బైక్‌పై అనుమానాస్పదంగా ఆలయం వద్ద సంచరించడాన్ని గమనించారు. సూరత్‌కు చెందిన విదుర్‌భాయ్ వాసవగా గుర్తించారు. అక్కడికి వెళ్లిన పోలీసులు ఇంటి నుంచి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. చోరీ చేసిన ఆలయ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఆలయం హాల్‌లోని వెంటిలేటర్ నుంచి గర్భగుడిలోకి ప్రవేశించి ఈ చోరీకి పాల్పడినట్లు పోలీస్ అధికారి తెలిపారు.





# పంట వ్యర్థాలు తగలబెట్టే రైతులకు రెట్టింపు జరిమానా

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ తీవ్రమవుతోంది. గత కొన్ని రోజులుగా ఢిల్లీ - ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి నాణ్యత చాలా పేలవమైన స్థాయిలో నమోదవుతోంది. ఏక్యూఐ లెవల్స్ రాజధాని ప్రాంతంలో 400కుపైనే నమోదవుతోంది. పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, హర్యానాల్లో రైతులు తమ పంట వ్యర్థాలను తగలబెడుతుండటంతో రాజధాని ప్రాంతంలో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పంట వ్యర్థాలను దహనం చేసే రైతులకు రెట్టింపు జరిమానా విధించేలా నిబంధనలను సవరించింది. రూ.30 వేల వరకూ జరిమానాను పెంచింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. కేంద్ర నిబంధనల ప్రకారం.. రెండు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రూ.5 వేల జరిమానా విధించనున్నారు. రెండు నుంచి ఐదు ఎకరాల మధ్య ఉన్న వారికి రూ.10 వేలు, ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రూ.30 వేలు జరిమానా విధించనున్నారు. కాగా, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. ఉదయం 9 గంటలకు ఢిల్లీలో గాలి నాణ్యత 367గా నమోదైంది. ఆనంద్ విహార్, జహంగీర్‌పురి, అశోక్ విహార్, బావన, ముండ్కల్, రోహిని, సోనియా విహార్, వివేక్ విహార్, వాజీపూర్.. ఈ తొమ్మిది ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రమైన కేటగిరీలో ఉందని కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. మరోవైపు కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యమునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది.

# భారత్, కెనడా సంబంధాలపై మాట్లాడిన జైశంకర్..

## ఆస్ట్రేలియా మీడియా సంస్థపై కెనడా నిషేధం



**మహా, న్యూఢిల్లీ:** భారత్, కెనడా మధ్య సంబంధాలు మరింతగా దిగజారాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న దౌత్య ప్రతిష్టంభన గురించి విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దీనిని ప్రసారం చేసిన ఆస్ట్రేలియా మీడియా సంస్థను కెనడా నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో కెనడా హిపోక్రసీపై భారత్ మండిపడింది. విదేశాంగ మంత్రి జైశంకర్ ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారు. ఆ దేశ విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌తో కలిసి ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభనపై మీడియా అడిగిన ప్రశ్నలకు ఆయన మాధానమిచ్చారు. కాగా, జైశంకర్ ప్రెస్‌మీట్ జరిగిన కొన్ని గంటల తర్వాత కెనడా స్పందించింది. దీనిని ప్రసారం చేసిన భారతీయ కమ్యూనిటీకి చెందిన ఆస్ట్రేలియా టుడేపై నిషేధం విధించింది.

# మరణశిక్షపై ఏఐ లాయర్‌కు ప్రశ్న వేసిన సీజేఐ చంద్రచూడ్..



**మహా న్యూఢిల్లీ:** చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇవాళ ఢిల్లీలో నేషనల్ జుడిషియల్ మ్యూజియంను ప్రారంభించారు. ఆ సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన లాయర్‌కు ఓ ప్రశ్న వేశారు. ఏఐ లాయర్‌ను ఆయన తన ప్రశ్నతో పరీక్షించారు. భారత్‌లో మరణశిక్ష రాజ్యాంబద్ధమేనా అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు కృత్రిమ మేధకు చెందిన లాయర్ సమాధానం ఇచ్చారు. అడ్వకేట్ టై కట్టుకుని, కంటి అద్దాలు ధరించిన ఆ ఏఐ లాయర్ మాట్లాడుతూ.. అవును, మరణశిక్ష భారత్‌లో రాజ్యాంగబద్ధమే అని పేర్కొన్నారు. చాలా అరుదైన కేసుల్లో మాత్రమే ఆ శిక్షను ఖరారు చేస్తారని, చాలా హేయమైన నేరాలకు సుప్రీంకోర్టు ఆ శిక్ష వేస్తుందన్నారు. ఏఐ లాయర్ ఇచ్చిన సమాధానంతో సీజే చంద్రచూడ్ ఆశ్చర్యపోయారు. స్మైల్ ఇస్తూ ఆయన అక్కడ నుంచి కదిలారు. సోమవారం నుంచి కొత్త సీజేగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# టైటాన్స్ అదుర్స్
## తమిళ్ తలైవాస్‌పై ఉత్కంఠ విజయం

**మహా, హైదరాబాద్:**
ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో మరోపోరు అభిమానులను కట్టిపడేసింది. గచ్చిబౌలి స్టేడియం వేదికగా బుధవారం హోరాహోరీగా సాగిన పోరులో తెలుగు టైటాన్స్ 3534 తేడాతో తమిళ్ తలైవాస్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. పీకేఎల్ 8వ సీజన్ తర్వాత తలైవాస్‌పై టైటాన్స్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. టైటాన్స్ తరఫున స్టార్ రైడర్ పవన్ సెహ్రావత్ 12 పాయింట్లతో అదరగొట్టగా, అశిష్ నార్వల్(9), విజయ్ మాలిక్(4) ఆకట్టుకున్నారు. మరోవైపు తలైవాస్ జట్టులో సచిన్ 17 పాయింట్లతో టాప్‌స్కోరర్‌గా నిలిచినా జట్టును గెలిపించలేకపోయాడు. పీకేఎల్‌లో 1000 పాయింట్ల క్లబ్‌లో సచిన్ తాజాగా చేరాడు. వరుసగా హ్యాట్రిక్ విజయంతో టైటాన్స్ 21 పాయింట్లతో 4వ స్థానంలోకి దూసుకురాగా, తలైవాస్ 21 పాయింట్లతో మూడులో ఉంది. మరో మ్యాచ్‌లో యూ ముంబా 4240తో పాట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది.

# 22వ ర్యాంక్‌కు విరాట్ కోహ్లీ
## పదేండ్లలో ఇదే ప్రథమం



దుబాయ్: రన్‌మిషీన్ విరాట్ కోహ్లీ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్(బ్యాటింగ్)లో మరింత దిగజారాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో ముగిసిన మూడు టెస్టుల సిరీస్‌లో ఆరు ఇన్నింగ్స్‌లలో కలిపి 93 పరుగులే చేసిన విరాట్.. ఐసీసీ బుధవారం విడుదల చేసిన టెస్టు బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో 8 స్థానాలు దిగజారి 22వ స్థానానికి పడిపోయాడు. 2014 ఇంగ్లండ్ సిరీస్ వైఫల్యం తర్వాత (నాడు 24వ స్థానం) కోహ్లీ ర్యాంకు ఈ స్థాయిలో పడిపోవడం ఇదే ప్రథమం.
టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ కూడా 2 స్థానాలు దిగజారి 26వ స్థానంలో ఉన్నాడు. యువ వికెట్ కీపర్ రిషభ్ పంత్ 5 స్థానాలు మెరుగుపరుచుకుని 6వ స్థానంలో నిలిచి మరోసారి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. ఈ జాబితాలో జో రూట్, కేన్ విలియమ్సన్ తొలి రెండు ర్యాంక్‌ల్లో ఉండగా యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ఒక ర్యాంక్ దిగజారి 4వ ర్యాంకుతో సరిపెట్టుకున్నాడు. బౌలర్ల జాబితాలో రబాడా అగ్రస్థానంలో కొనసాగుతుండగా హెజిల్‌వుడ్, బుమ్రా, కమిన్స్, అశ్విన్, జడేజా టాప్-6లో ఉన్నారు.

# విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీకి భూమి పూజ చేసిన పీవీ సింధు



**మహా, హైదరాబాద్:**
విశాఖలో బ్యాడ్మింటన్ అకాడమీకి స్టార్ ప్లేయర్ పీవీ సింధు భూమి పూజ చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అకాడమీ నిర్మాణానికి తన తల్లిదండ్రులతో కలిసి గురువారం ఉదయం భూమి పూజ చేశారు. పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా పీవీ సింధు తెలిపారు. ఈ భూమి విషయంలో ఎలాంటి వివాదం లేదని.. ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చినట్లు వివరించారు. ఈ అకాడమీ ద్వారా ఎంతో మంది క్రీడాకారులను తయారు చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అకాడమీకి సంబంధించిన అన్ని వివరాలూ త్వరలోనే వెల్లడిస్తామని ఈ సందర్భంగా పీవీ సింధు వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం పీవీ సింధుకు విశాఖపట్నంలోని పెదగదిలి కూడలి సమీపంలో భూమి కేటాయించిన విషయం తెలిసిందే.


# స్పోర్ట్స్ పాలసీతో క్రీడారంగంలో మార్పులు

**మహా, హైదరాబాద్:**
స్పోర్ట్స్ పాలసీతో తెలంగాణ క్రీడారంగంలో మార్పులు రాబోతున్నాయి. బుధవారం గచ్చిబౌలి స్టేడియంలో శాట్స్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ పాలసీ, స్పోర్ట్స్ హబ్, సీఎం కప్ నిర్వహణపై ప్రధానంగా చర్చ జరిగింది. శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి అధ్యక్షతన జరిగిన భేటీలో ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ క్రీడా సంఘాల సభ్యులు ప్రాతిపాదిత స్పోర్ట్స్ పాలసీలో ముఖ్య అంశాలతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఏఏ విభాగాలు ఏర్పాటు చేయబోతున్నారో వివరించారు. వివిధ టోర్నీల్లో తెలంగాణ క్రీడాకారుల ప్రదర్శనను పరిగణనలోకి తీసుకుంటూ నగదు ప్రోత్సహకాలను, ఉద్యోగ అవకాశాలను నూతన స్పోర్ట్స్ పాలసీలో స్పష్టం చేయబోతున్నట్లు చైర్మన్ తెలిపారు.





# సినిమా వార్తలు MOVIE NEWS



# ఐ హేట్ యూ డాడీ.. అంటున్న విశ్వక్‌సేన్



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకుడు. ఎస్‌ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా నుంచి 'ఐ హేట్ యూ మై డాడీ' అనే పాటను విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ స్వరపరచిన ఈ పాటను సనారే రచించారు. రామ్ మిరియాల ఆలపించారు. తండ్రీకొడుకుల మధ్య వుండే ప్రేమానుబంధాన్ని ఆవిష్కరిస్తూ ఈ పాట అర్థవంతంగా సాగింది. విశ్వక్‌సేన్ డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ ఇదని, విశ్వక్‌సేన్ పాత్ర గత సినిమాలకు భిన్నంగా ఉంటుందని, వినోదానికి పెద్దపీట వేశామని చిత్రబృందం పేర్కొంది.



# ఉందిలే మంచి కాలం

కన్నడ భామ పూజాహెగ్డే కెరీర్ తొలినాళ్లలోనే అగ్ర హీరోల చిత్రాల్లో అవకాశాలు దక్కించుకొని సత్తా చాటింది. ముఖ్యంగా తెలుగునాట యూత్‌లో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ భామకు అదృష్టం ఏమాత్రం కలిసి రావడం లేదు. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లో ఆమె నటించిన చిత్రాలన్నీ డిజాస్టర్స్‌గా మిగిలాయి. దీంతో పూజాహెగ్డే కెరీర్ ఇక ముగిసినట్లే అని భావించారు. కానీ ఈ భామ అనూహ్యంగా పుంజుకుంది. తెలుగు, తమిళంలో భారీ అవకాశాలను దక్కించుకొని అందరినీ ఆశ్చర్యపరచింది. ప్రస్తుతం ఈ భామ చేతిలో ఐదు చిత్రాలున్నాయి. తమిళంలో సూర్య, విజయ్ 69 చిత్రాల్లో ఈ అమ్మడు కథానాయికగా ఖరారైంది. అలాగే బాలీవుడ్‌లో షాహిద్‌కపూర్ సరసన 'దేవ' చిత్రంలో నటించనుంది. ఇలా వరుస భారీ ఆఫర్లతో కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందే ప్రయత్నాల్లో ఉంది పూజాహెగ్డే. ఫెయిల్యూర్స్ వల్ల ఎప్పుడూ బాధపడలేదని, మంచి సమయం కోసం ఓపిగ్గా ఎదురుచూశానని, భవిష్యత్తులో అంతా మంచే జరుగుతుందనే నమ్మకం ఉందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ధీమా వ్యక్తం చేసింది పూజాహెగ్డే.

# పుష్పరాజ్ ఫీవర్..
## అల్లు అర్జున్‌తో పోటీపై విక్కీ కౌశల్ వెనక్కి తగ్గాడా..?



తెలుగుతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప 2 ది రూల్. టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్‌సుకుమార్ కాంబోలో వస్తోన్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మరోవైపు బాలీవుడ్ యాక్టర్ విక్కీ కౌశల్ నటిస్తున్న చిత్రం ఛావా. లక్ష్మణ్ ఉటేకర్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 06న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారని తెలిసిందే. మహారాష్ట్ర చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విక్కీ కౌశల్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాలలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తోంది.పుష్ప ది రూల్ సినిమాపై ఇప్పటికే సూపర్ బజ్ క్రియేట్ అవడమే కాదు.. విడుదలకు ముందే నిత్యం వార్తల్లో నిలుస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఇక పుష్పరాజ్ మేనియాతో విక్కీ కౌశల్ టీం విడుదల విషయంలో వెనక్కి తగ్గినట్టు ఓ వార్త నెట్టింట వైరల్ అవుతోంది. మరి నిజంగానే ఛావా అనుకున్న సమయానికి రావడం లేదనేది కేవలం పుకారు మాత్రమేనా..? నిజమా..? అనేది తెలియాల్సి ఉంది. పుష్ప 2 ది రూల్‌లో మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీ రోల్ చేస్తుండగా.. భన్వర్ సింగ్ షెకావత్ పాత్రలో మరోసారి సందడి చేయబోతున్నాడు. సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, అజయ్ ఘోష్ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.